కొమురెల్లి మల్లన్న ఆలయం వద్ద రైల్లే స్టేషన్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర రైల్వేశాఖ మంత్రికి సిఫార్సు పత్రం పంపించిన బండి సంజయ్



నవతెలంగాణ-కొమురవెల్లి

తెలంగాణ రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి మల్లికార్జున స్వామి వారి దేవాలయం వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ.. బీజేపీ జిల్లా నాయకులు, రాష్ట్ర ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ ఉడుత మల్లేశం యాదవ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌ని కలిశారు. ఈ మేరకు బుధవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు బండి సంజయ్ సిఫార్సు పత్రం పంపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మల్లన్న ఆలయం వద్ద రైల్వే స్టేషన్ ఏర్పాటుకు తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ 1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

గురువారం 20 ఏప్రిల్ 2023

అల్లా దువా అందరి పైన ఉండాలి



నవతెలంగాణ-జహీరాబాద్

అల్లా దువా అందరి పైన ఉండాలని.. నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ఎమ్మెల్యే మాణిక్ రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఫ్రెండ్స్ కల్యాణ మండపంలో ప్రభుత్వపరంగా ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇఫ్తార్ విందులను ఏర్పాటు చేసి మైనార్టీ సహోదరుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అనంతరం మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు మహమ్మద్ తన్వీర్‌కు ఖర్జూర పండ్లు తినిపించి ఒక్కపొద్దు విడిపించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ లు అల్లాడి నర్సింలు, మహంకాల్ సుభాష్ గుప్తా, మహమ్మద్ తంజీం, లావణ్య, చందు, మురళీకృష్ణ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండప్ప యాదవ్, పట్టణ అధ్యక్షులు సయ్యద్ మహీయుద్దీన్, రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్, నాయకులు జాంగిర్, రాములు నేత మోతీరాం బాబి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల నాయకులతో ఎమ్మెల్యే సమావేశం

నవతెలంగాణ-మునిపల్లి

మండల బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ నేడు(గురువారం) ఎస్‌విఎస్ ఫంక్షన్ హాల్లో సమావేశం నిర్వహించనున్నారు. మండలంలో మునుముందు ఏ విధంగా ప్రజల్లోకి వెళ్లాలి.. పార్టీ చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు ఏ విధంగా తెలియజేయాలనే విషయాలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేయనున్నట్టు సమాచారం.

గుండెపోటుతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు మృతి



నవతెలంగాణ-జోగిపేట

సంగారెడ్డి జిల్లా చౌటకూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు గుండెపోటుతో మృతి చెందింది. తోటి ఉపాధ్యాయులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి లోని చాణిక్యపురి కాలనీకి చెందిన పద్మలత చౌటకూర్ లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తుంది. బుధవారం పాఠశాలకు వచ్చిన ఆమె తరగతి గదిలో ఉన్న సమయంలో గుండె నొప్పి రావడంతో కుప్పకూలిపోయింది. సమీపంలోని తోటి ఉపాధ్యా యులు గమనించి ఆమెను వెంటనే సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గత ఐదేళ్లుగా చౌటకూర్ ప్రాథమిక పాఠశాలలోని విధులు నిర్వహిస్తూ అందరితో కలుపుగోలుగా ఉండే ఆమె మృతి చెందడం పట్ల తోటి ఉపాధ్యాయులు కన్నీటి పర్యంతం అవుతున్నారు

పేదలకు రంజాన్ పండుగ చీరల పంపిణీ



నవతెలంగాణ-సదాశివపేట

రంజాన్ పండుగను పురస్కరించుకొని జ్యోతిరావు పూలే సంఘం ఆధ్వర్యంలో బుధవారం పేద ముస్లింలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం వైస్ చైర్మెన్ చింతగోపాల్ పాల్గొని మహిళలకు చీరలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తున్నదని.. కుల మతాలకతీతంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ పండుగలను అధికారికంగా నిర్వహిస్తున్నదన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన జ్యోతిరావు పూలే సంఘం అధ్యక్షులు ఎండి జావిద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు ఏం అంతయ్య, జనరల్ సెక్రటరీ ప్రకాష్, వెంకటేశం, శీను, చింత ఆదర్శ్, రాము, దాస తుకారం, తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈగా అర్జున్ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల విద్యుత్ ఏఈగా అర్జున్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఏఈ అశ్విని హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లడంతో.. సంగారెడ్డి నుంచి అర్జున్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు, రైతులకు విద్యుత్ సమస్య లేకుండా చూస్తానన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం అందించాలన్నారు.

గొర్రెల,మేకల పెంపకం దార్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నగేష్



నవతెలంగాణ-హత్నూర

మల్లికార్జున గొర్రెల, మేకల పెంపకందార్ల సహకార సంఘం కాసాల గ్రామ కమిటీ అధ్యక్షులుగా కొమరగోళ్ల నగేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బక్క నారాయణ, కోశాధికారిగా అచ్చిని పాపయ్య డైరెక్టర్లుగా పాతూరి నగేష్, మద్దూరి మల్లికార్జున, సుగుణమ్మ, పక్క లక్ష్మిలను పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నుకోబడిన గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరగొల్ల నగేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న కురుమ గొర్ల మేకల పెంపకం దారుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. తన ఎన్నికకు సహకరించిన పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు చేశారు.

ఆహారం దొరక్క యాచకుడు మృతి!



నవతెలంగాణ-మునిపల్లి

ఆహారం దొరక్క, వడ దెబ్బతో గుర్తుతెలియని యాచకుడు మృతి చెందిన ఘటన మునిపల్లి మండలం బుదేరాలో జరిగింది. మునిపల్లి పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. బుదేరాలోని బెనిత్ (ఇండస్ట్రీల్) పరిశ్రమ వద్ద బుధవారం ఓ కుళ్ళిన స్థితిలో వ్యక్తి మరణించి ఉండడాన్ని గమనించిన పరిశ్రమ యాజమాన్యం గ్రామ పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి దృష్టికి తీసుకువచ్చారు. ఆమె పోలీసులకు సమచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అయితే అతడు రెండు మూడు రోజుల క్రితమే మరణించి ఉండొచ్చన్నారు. యాచకుడు అయి ఉంటాడని.. ఆహారం దొరక్క మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని వయస్సు 40 నుంచి 45 ఏండ్ల మధ్య ఉంటుందని.. బ్లాక్ కలర్ నైట్ ప్యాంటు, తెలుపు రంగు గీతలతో చినిగిన అంగీ మరియు మెడలో, చేయికి నలుపు రంగు పూసల రంగు ధారం ధరించి ఉన్నాడన్నారు. ఎవరైనా గుర్తుపడితే 8712656749, 8977649139 నెంబర్‌లకు సమాచారం ఇవ్వాలన్నారు. కాగా కార్యదర్శి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



నవతెలంగాణ-హవేలీఘనపూర్

ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ఔరంగాబాద్ శివారులో మంగళవారం రాత్రి చోటుచే సుకుంది. హవేలీ ఘనాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం గుండారంకు చెందిన బోడవత్ వినోద్ కుమార్(31) మెదక్ నుంచి గుండారం వెళ్తుండగా ఔరంగాబాద్ వద్ద గురు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో అతను తీవ్రంగా గాయపడగా అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్ తరలించే క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి జములా నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



నవతెలంగాణ-పటాన్‌చెరు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మోతే మండలం మామిండ్ల గ్రామానికి చెందిన కంచర్లకుంట గోపిరెడ్డి (31) ఉపాధి నిమిత్తం సుమారు మూడేండ్ల క్రితం హైదరాబాద్‌కి వలస వచ్చి అపర్ణ కన్స్ట్రక్షన్‌లో స్టోర్ ఇంచార్జిగా పనిచేస్తున్నాడు. అయితే విధుల్లో భాగంగా గోపిరెడ్డి మంగళవారం రాత్రి సంగారెడ్డి వైపు నుంచి పటాన్‌చెరు వైపుకి తన మోటార్ సైకిల్ పై వస్తున్నాడు. మార్గమధ్యంలో సుమారు రాత్రి 11 గంటల సమయంలో ఇస్నాపూర్‌లోని ఎస్‌బీఐ బ్యాంక్ యూటర్న్ వద్దకు రాగానే వెనకాల వైపు నుండి ఒక గుర్తు తెలియని వాహనం అతన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో తలకి బలమైన గాయమై గోపిరెడ్డి అక్కడికక్కడే చనిపోయాడు. మృతుడు గోపిరెడ్డి తమ్ముడు మధుసూదన్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామనాయుడు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అంతా విషమే..



వేసవి తాపం నుంచి చక్కని ఉపశమనానికి పండ్లు తినండి.. ఈ సీజనల్ పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి అని వైద్యుల నుంచి సామాన్యుల వరకు చెబుతుంటారు. సహజసిద్ధంగా ప్రకృతి నుంచి వచ్చిన ఫండ్లతో మేలు జరిగినప్పటికీ.. రసాయనాలతో మాగపెడుతున్న పండ్లతో మాత్రం ఆరోగ్యం కంటే అనారోగ్యమే ఎక్కువగా ఉంటుంది. వేసవి వచ్చిందంటే చాలు పండ్ల వ్యాపారం జోరందుకుంటుంది. పండ్లు శరీరారోగ్యానికి ఎంతగానో ఉపయోగపడుతాయో.. కృత్రిమంగా పండించిన పండ్లను తింటే అంతే చెడు చేస్తాయి. అయితే వ్యాపారుల స్వార్థ ప్రయోజనాలతో స్వచ్ఛమైన పండ్లు మాత్రం అందు బాటులో లేకుండా పోతున్నాయి.

- రసాయనాలతో మాగబెడుతున్న పండ్లు
- పైన మెరుపులు.. లోపల విషాలు
- నిబంధనలు తూట్లు పొడుస్తున్న వ్యాపారులు
- ప్రజారోగ్యంపై పట్టింపేది.?

నవతెలంగాణ-జహీరాబాద్

వేసవి కాలం వచ్చిందంటే పండ్ల రసాలు తాగడం సహజం. కాయలు పక్వానికి రాకముందే తెంపి కాల్షియం, కార్బొరేట్ వంటి రసాయనాలతో మాగబెడుతున్నారు. మామిడి, అరటి, ద్రాక్ష, బొప్పాయి, సపోటా తదితర పండ్లపై ఎక్కువగా ఈ ప్రయోగాలు కొనసాగుతున్నాయి. పక్వానికి రాని పండ్లను కొంత మంది వ్యాపారులు తక్కువ ధరకు పండ్లను కొనుగోలు చేసి కృత్రిమంగా పండించి వినియోగదారులకు ఎక్కువ ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.



ఇలా మాగబెడుతున్నారు..

కాయలు పూర్తిగా దిగుబడి దశకు రాకముందే రసాయనాలతో మగ్గించి మార్కెట్‌లోకి తీసుకువస్తున్నారు. తర్బుజ, ఖర్బూజ, దోసకాయ తదితర పండ్లు త్వరగా పెరిగేందుకు ఇంజక్షన్ల ద్వారా రసాయానాలను ఇస్తున్నారు. గ్యాస్ వెల్డింగ్‌కు వినియోగించే కాల్షియం కార్బొనైట్‌ను కొను గోలు చేసి కుప్పగా పోసిన కాయల్లో నాలుగు వైపులా వీటిని అమరుస్తారు. 50 కిలోల కాయలకు 30 వరకు పొట్లాలను పెడతారు. ఈ గుళికలు పౌడర్‌గా మారి వేడి పుట్టిస్తాయి. ఇలా కాయలు తొందరగా పక్వానికి వచ్చి పచ్చగా మెరుస్తాయి.

రసాయనాలు కలిపిన పండ్లతో అనారోగ్యం

రసాయనాలతో పండించిన పండ్లను తినడం ద్వారా నరాలు బలహీనపడటంతో పాటు తలనొప్పి, మగతగా ఉండడం, ఫిట్స్ రావడం, మతిమరుపు రావడం వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. అలాగే కాలేయం, మూత్రపిం డాలు, జీర్ణాశయంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందం టున్నారు.ఇలా పండ్ల వ్యాపారం జహీరాబాద్ జోరుగా కొనసాగుతుంది. పండ్లను సహజంగానే మగ్గబెట్టి విక్రయించాలని, అలా కాకుండా వివిధ రకాల రసాయనాలు, కార్బొరైట్‌ను వినియోగించి పండ్లను మాగబెడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని హై కోర్టు 2016లో ఆదేశించింది అయిన వ్యాపారులు మాత్రం మారడం లేదు. ప్రస్తుత వేసవి సీజన్‌లో పండ్లను ఇలాగే మాగేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమ డుతున్నారు. అధికారులు ఎప్పుడో ఒకప్పుడు నామ మాత్రంగా తనిఖీలు చేస్తున్నా.. కఠినంగా వ్యవహరించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

చట్టల అమలులో అధికారులు విఫలం



పండ్లను రసాయనలతో మగబెట్ట కూడదని నిబంధనలు ఉన్నప్పటికి.. వాటిని అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలం అయ్యారు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తు కార్బొరైట్‌లతో పండ్లను మగ్గబెట్టి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీని మూలంగా డబ్బులు ఇచ్చి ఆనారోగ్యాలకు గురి కావాల్సి వస్తుంది.

– రమేష్

ఆనారోగ్యాలకు గురవుతున్నాం



రసాయనాలతో మగ్గబెట్టిన పండ్లను తినడంలో వల్ల ఆనారోగ్యాలకు గురవుతున్నాం. ప్రస్తుతం మార్కెట్లో పండ్లు కొనుగోలు చేయాలంటేనే భయం అవుతుంది. రసాయనాలు ఎక్కువ మోతాదులో వాడడంతో పండ్లు తిన్న వెంటనే వాంతులు, విరేచనాలు అవుతున్నాయి. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

– అహ్మద్



చట్టసభల్లో గొల్ల, కురుమల ప్రాతినిధ్యం పెరగాలి

నవతెలంగాణ-పాపన్నపేట

చట్టసభల్లో గొల్ల కుర్మా యాదవుల ప్రాతినిధ్యం పెరగడంతో పాటు పాడి పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఉమ్మడి మెదక్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్ అన్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపా యల వన దుర్గా భవాని మాతను బుధవారం దర్శించుకుని ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. అనంతరం గోకుల్ షెడ్ లో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గొల్ల కుర్మ యాదవుల అభివృద్ధికోసం గొర్రెల పంపిణీ పథకంతో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిం దని కొనియాడారు. రెండో విడుత గొర్రెల పంపిణీ ఎలాంటి ఆటం కాలు, అవాంతరాలు లేకుండా అందరికి అంది సవ్యంగా సాగాలని అమ్మవారినీ మొక్కుకున్నట్లు వెల్లడించారు. మెదక్, సంగారెడ్డి సిద్దిపేట జిల్లాల యాదవ సంఘం అధ్యక్షులు గండి మల్లేష్ యాదవ్, పెరుగు ఐలేష్ యాదవ్ మరియు మామిండ్ల ఐలయ్య యాదవులతో కలిసి అమ్మవారిని దర్శించుకొని జోడు పొట్టేల్ల మొక్కులు చెల్లించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే మళ్ళీ సకుటుంబ, సపరివారంతో వచ్చి దర్శించుకొని మొక్కులు చెల్లిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలింగం యాదవ్, మహేష్ యాదవ్, ఐతంరాజు యాదవ్, రాజబోయిన పర్శరాములు యాదవ్, అంజయ్య యాదవ్,పి వెంకటేష్ యాదవ్, గడ్డి నర్సింహ్మా యాదవ్, కృష్ణ యాదవ్ మరియు పుల్లేష్ తదితరులు పాల్గొన్నారు..

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉధృత పోరాటాలు

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జేమల్లికార్జున్



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఉధృత పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జే.మల్లికార్జున్ పిలుపునిచ్చారు. సీఐటీయూ సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం కేవల్ కిషన్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కార్మిక హక్కులను హరిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదన్నారు. కార్మికుల పొట్ట కొడుతున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశంలోని కార్మిక వర్గం ఉధృత పోరాటాలకు సిద్ధమవుతుందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా తెచ్చి కార్మిక వర్గాన్ని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కార్మిక హక్కుల కోసం కార్మిక వర్గం సత్తా ఏంటో మోడీకి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రోజురోజుకు ధరలు పెంచుతున్న మోడీ కార్మికుల వేతనాలు పెంచాలని ఇంకిత జ్ఞానం కూడా లేదన్నారు. రాబోయే కాలంలో కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. మల్లేష్ ,జి. సాయిలు నాయకులు రాజయ్య, యాదగిరి, ప్రవీణ్, మంగా, విద్యాసాగర్, నాగేశ్వరరావు, సురేష్, చిరంజీవి, బాబురావు అనంత్ రావు నర్సింలు జార్జ్ పెంటయ్య, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

కండర క్షీణత బాధితుల సమస్యలను పరిష్కరించాలి

- మంత్రి హరీష్ రావును కలిసి వినతిపత్రం అందజేసిన టిఎండిఏ రాష్ట్ర కార్యవర్గం



నవతెలంగాణ-పటాన్‌చెరు

కండర క్షీణత బాధితుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టిఎండిఏ) రాష్ట్ర అధ్యక్షులు ఆలూరి వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మఠపతి రవికుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలోని నానక్ రామ్ గూడలో రాష్ట్ర వైద్య ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు బుధవారం తెలంగాణ మస్కులర్ డిస్ట్రోఫీ అసోసియేషన్ (టిఎండిఏ) ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేర్ టేకర్, కేర్ టేకర్ అలవెన్స్ గాని కండరాల క్షీణత బాధితులకు మంజూరు చేయాలన్నారు. అలాగే హెల్త్ కార్డు, న్యూట్రిషన్ కిట్టు, దశలవారీగా బ్యాటరీ వీల్ చైర్స్, మెడిసిన్స్ పూర్తి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా 3500 పైచిలుకు కండరాల క్షీణత బాధితులు ఉన్నారని తెలిపారు. ఈ వ్యాధిని డాక్టర్లు నయం చేయలేని జన్యు పరమైన జబ్బుగా చెప్తున్నారన్నారు. కండరాల క్షీణత అంటే తన పని తాను చేసుకోలేని దుర్భరమైన జీవితం, దినదినంగా ఒంట్లో శక్తి కోల్పోతూ కండరాలు కరిగిపోతాయన్నారు. కనీసం కాళ్ళు, చెయ్యి కలపలేమని, చీమ కరిచిన తీసుకోలేని పరిస్థితి అని తెలిపారు. రోజువారి కాలకృత్యాలు కూడా తీర్చుకోలేని పరిస్థితి, ఇతరులపై ఆధారపడి జీవించే జీవనం గడుపుతారని తెలిపారు. జీవచ్ఛవంలా నాలుగు గోడల మధ్య కన్నవాళ్ళకు తోబుట్టువులకు భారమవుతూ భారమవుతూ బతికిడుస్తున్న దీనస్థితి అన్నారు. అటు సమాజానికి, ఇటు స్నేహితులకు దూరమ వుతూ మానసిక శోభ అనుభవిస్తూ వీల్ చైర్ లకు, బెడ్డు మంచాలకు పరిమితమై నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. పై విషయాలని వంటిని సవివరంగా మంత్రికి వివరించామని.. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి టేకర్, కేర్ టేకర్ అలవెన్స్ మంజూరయ్యేలా చూస్తాననిహామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కత్తుల బాలకృష్ణ, కార్యదర్శి మెట్టపల్లి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎండిపోయిన వరికి నష్టపరిహారమివ్వాలి

- ఎకరాకు రూ. 25 వేలు చెల్లించాలి
- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాజయ్య



నవతెలంగాణ-జోగిపేట

ఆందోల్ మండలం చింతకుంటలో బోరుబావుల్లో నీరు ఎండిపోవడం, చెరువులో నీళ్ల లేకపోవడంతో గ్రామంలోని దాదాపు 50 కుటుంబాలకు చెందిన రైతుల వరి పొలం ఎండిపోయిందని.. వారికి ప్రభుత్వం ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారం చెల్లించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజయ్య, ఉపాధ్యక్షులు బి యాదవ రెడ్డిలు డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటల్లో బుధవారం వారు పర్యటించి.. రైతులతో మాట్లాడారు. 50 కుటుంబాలకు పైగా రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి పొలం నీళ్ల లేకపోవడంతో కండ్ల ముందే ఎండిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజుల నుంచి ఈ దుస్థితి ఉన్నప్పటికీ.. ప్రభుత్వం గానీ, అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే సంబంధిత వ్యవసాయ అధికారులు పర్యటించి పరిశీలించి.. పంట ఎండిపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలన్నారు. తిరిగి పంట వేసుకోవడానికి పెట్టుబడిగా పంట రుణాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున రైతులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు మల్లేశం, నబిసాబ్, నాగరాజు, రాజు, బేతయ్య జోగయ్య చెన్నయ్య ,పోచయ్య, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నరోత్తం జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని ఎన్ కన్వెన్షన్ హాల్‌లో బుధవారం టీపీసీసీ నాయకులు వై.నరోత్తం జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ మాజీ అధ్యక్షులు యం జైపాల్ రెడ్డితో కలిసి జన్మదిన కేక్‌ను నరోత్తం కట్ చేశారు. కాగా ఆయన్ను భారీ గజమాలలతో అభిమానులు సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో యం.జైపాల్‌రెడ్డి మాట్లా డుతూ.. ప్రజా సేవ చేయడానికి వై.నరోత్తం ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చారన్నారు. అనంతరం నరోత్తం మాటాడుతూ.. తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి పార్టీల కార్యకర్తలు, అభిమానులు చూపిస్తున్న అభిమానం ఎనలేనిదన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లా వేళలా అందుబాటులో ఉంటూ.. ప్రజల సంక్షేమానికి పాటుపడుతానన్నారు. పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో కోహిర్ జెడ్పీటీసీ రాందాస్, ఎంపీపీ అధ్యక్షులు దేవదాస్, సీనియర్ నాయకులు సయ్యద్ మసూద్ హుస్సేన్, యం. మోహన్ రెడ్డి, శంకర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి, మైనోద్దీన్, ముల్తానీ, మహ్మద్ యూసుఫ్, ఎంఎటీ శీనులు బాబు, సుదర్శన్ రెడ్డి, జ్ఞానరత్నం, రాజేశ్వర్, రాజు స్వామి, సర్పంచ్‌లు నవాజ్ రెడ్డి, శ్రీనివాస్, నందప్ప పాటిల్, కృష్ణ, ప్రకాష్, రాజునాయక్, నబిపటేల్, ,శ్రీకాంత్, జగన్, ఈశ్వరప్ప, రవి స్వామి, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు జయప్రదం చేయాలి



నవతెలంగాణ-మెదక్‌టౌన్

మెదక్ జిల్లాలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు జూన్ 3 నుండి 7 వరకు నిర్వహిస్తున్నామని.. ఈ తరగతులకు 12 జిల్లాల నాయకులు పాల్గొంటారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటి కొండ రవి అన్నారు. ఈ సందర్భంగా కేవల్ కిషన్ భవనంలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని జగన్ అధ్యక్షతన నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా తాడికొండ రవి పాల్గొని మాట్లాడుతూ.. భారత విద్యార్థి ఫెడరేషన్ 1970లో ఏర్పడి అధ్యయనం-పోరాటం అనే నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యం కోసం నిరంతరం పోరాడుతున్నదన్నారు. విద్యార్థులకు శాస్త్రీయమైన విద్యా విధానం అందాలని.. చదువు ద్వారానే భవిష్యత్తు ఏర్పడుతుందన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలపై.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్య వ్యాపారంపై.. చదువుతూ పోరాడు-చదువుకై పోరాడు అనే నినాదాన్ని ముందుకు తీసుకుపోవడానికి పోరాడాలని పిలుపునిచ్చారు. మెదక్ జిల్లాలో ఉన్నత విద్య చదవడానికి విద్యాలయాలు లేక చాలా దూరం ప్రయాణాలు చేయాల్సి వస్తోందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నిర్వహిస్తున్న విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతుల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, సహాయ కార్యదర్శి అజయ్, వివిధ మండల నాయకులు నవీన్, సంజయ్, శ్రీకాంత్, రాకేష్, రవి, రఘు, కార్తిక్, శివాజీ, పొచ్చయ, మహేందర్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

చిన్నారుల విద్యకు సీఐ వేణుగోపాల్‌రెడ్డి చేయూత



నవతెలంగాణ-పటాన్‌చెరు

తల్లిదండ్రులు లేని భాగ్యులైన చిన్నారులను గుర్తించి వారిని చదువుకునేలా ఆర్థిక చేయూత కల్పిస్తూ పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. తల్లిదండ్రులు లేక అమ్మమ్మల వద్దో, నానమ్మల వద్దో ఉంటూ.. చదువుకోవాలని ఆసక్తి ఉన్నా చదువుకు దూరమైన ఐదుగురు పిల్లలను గుర్తించి, చదువుకుని వారి కాళ్లమీద వాళ్ల నిలబడేలా ఒన్ చాలెంజ్ అనే సంస్థ ద్వారా సాయాన్ని అందిస్తున్నారు. తాను పుట్టి పెరిగిన ప్రాంతవాసులకు ఏదోచేయాలనే ధృడ సంకల్పంతో.. చిన్నారులు చదుకోవడానికి తనవంతు కృషి చేస్తున్నారు. నల్గొండ జిల్లా నిడమానూరు మండలం ముకుందాపు రానికి చెందిన లిఖిత, లావణ్య అనే 14 ఏళ్లలోపు చిన్నారుల తల్లి కరోనాతో కొంత కాలం క్రితం చనిపోయింది. దీనికితోడు తండ్రి ఆసరగా వైక్యల్యం కలిగి ఉండడంతో.. అతను కూడా పిల్లల యోగక్షేమాలు చూడలేకపోయాడు. దీంతో పిల్లలు నానమ్మ వెంకటనర్సమ్మ వద్దే ఉంటుండగా.. వారి చదువు ముందుకు సాగడం లేదు. అలాగే బియ్యపల్లి గ్రామానికి చెందిన నేహ, వర్షిత్ అనే ఇద్దరు ఆరేళ్లలోపు చిన్నారుల తల్లిదండ్రులు చనిపోయారు. వారు కూడా నానమ్మవద్దే ఉంటున్నారు. వారి చదువు కూడా అంతంతమాత్రంగానే నడుస్తోంది. నిడమనూరు గ్రామానికి చెందిన 15 ఏళ్ల కీర్తన తల్లి పున్నెమ్మ చనిపోయింది. తండ్రి వెళ్లిపోవడంతో వారి మేనమామ వద్దే ఉంటోంది. ఆమె ఆర్థిక పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో వీరందరికీ ఒన్ చాలెంజ్ సంస్థ ద్వారా చదువుకునేలా ఆర్థిక సహాయం అందించేందుకు వేణుగోపాల్‌రెడ్డి ముందుకు వచ్చారు.

ఎంఎస్ఎన్ పరిశ్రమ కార్మికులకు ఒన్‌చాలెంజ్ ప్రేరణ..

ఎంఎస్ఎన్ పరిశ్రమకు చెందిన కార్మికులు ప్రతీ ఏడాది వినాయకుడిని ఏర్పాటు చేస్తుంటారు. వీరు ఏర్పాటు చేసిన మండపంలో లడ్డూను వేలంపాట పెట్టి వచ్చిన నగదుతో సేవా కార్యక్రమాలు చేయదలిచారు. పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్ రెడ్డి తాను పుట్టిన ప్రాంతానికి ఒన్ చాలెంజ్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలకు ప్రేరణ పొంది, వేలం పాటలో వచ్చిన నగదును డీడీల రూపంలో రూ.2.1 లక్షల ఆర్థిక సాయాన్ని కార్మికులు ఈ ఐదుగురు చిన్నారులు చదువుకునేందుకు ముందుకు వచ్చారు. మరో వ్యాపారవేత్త సాయి పదేళ్ల లోపు చిన్నారులు నలుగురికి 2.4 లక్షలు, 15 సంవత్సరాల బాలిక 10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు రావడం విశేషం. ఈ విధంగా సీఐ వేణుగోపాల్ రెడ్డి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు పటాన్ చెరు పారిశ్రామిక ప్రజలు అభినందిస్తున్నారు

పంచాయతీ కార్యదర్శుల సమ్మె సన్నాహక సమావేశం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు మండలాల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, అవుట్సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టబోయే సమ్మె సన్నాహక సమావేశం బుధవారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్టు ప్రకటించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చిలుక కరుణాకర్, తెలంగాణ పంచాయతీ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజమణి, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దామర చెరువులోకి నీటి సరఫరాకు అధికారుల చర్యలు

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని చింతకుంట గ్రామ దామర చెరువులోకి గత ఆరు ఏళ్లుగా నీటి సరఫరా లేకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఈనెల 17న రైతులు రాస్తారోకో చేయడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు బుధవారం అన్నాసాగర్ చెరువు నుంచి దామర చెరువులోకి నీటిని సరఫరా చేసేందుకు కాలువల పూడికతీత పనులను చేపట్టారు. 2.5 కిలోమీటర్ మేర కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలను పూడికే తీర్థ పనులను వర్క్ ఇన్స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో చేపట్టారు. దీంతో ఆయకట్టు రైతులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.



బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

కండువా వేసి ఆహ్వానించిన మాజీ ఉపముఖ్యమంత్రి

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని ఏర్రారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మూడో వర్డ్ మెంబర్ శంకర్‌తో పాటు యువ నాయకులు అరుణ్ కుమార్, దిల్ కుమార్, అనిల్, అప్పారావు, టిల్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డిలోని మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి దామోదర్ రాజనర్సింహ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు నరసిం హారెడ్డి, ఉపాధ్యక్షుడు బీరప్ప, యూత్ అధ్యక్షులు చంద్ పాష, మండల యువజన నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.





నిరుపేదలకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం

నవతెలంగాణ-జహీరాబాద్

నిరుపేదలకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. జహీరాబాద్ మండలానికి చెందిన 15 లబ్దిదారులకు రూ.50,4000 ముఖ్యమంత్రి సహాయనిధి డబ్బులు మంజూరయ్యాయి. ఇందుకు సం బంధించిన చెక్కులను క్యాంపు కార్యాలయంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే మాణిక్‌రావు బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామాధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లోకి కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-జహీరాబాద్

ఝరాసంగం మండలంలోని జునేగోన్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు సంగారెడ్డి, గోపాల్‌రెడ్డిలు ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ ప్రభుత్వం.. కేసీఆర్ పరిపాలన, అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లోకి చేరినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విజయ కృష్ణ, గ్రామ అద్యక్షులు వీరన్న పటేల్, నాయకులు మిథున్ రాజ్, ఇద్గి నగేష్, మ్యకల అంజన్న, బెగరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎల్లమ్మ పండుగలో పాల్గొన్న జెడ్పీటీసీ

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని ఖానాపూర్ కే గ్రామంలో జరిగిన ఎల్లమ్మ పండుగలో జెడ్పీటీసీ నరసింహారెడ్డి హాజరై.. పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. ఎల్లమ్మ ఆశీస్సులతో ఖానాపూర్ కే ప్రజలు మరియు కల్హేర్ మండల ప్రజలు బాగుండాలని కోరుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవిత గోపాల్ రెడ్డి, కృష్ణపూర్ ఎంపీటీసీ నర్వ గుండమ్మ, అంజయ్య సాగర్, పీఏసీఎస్ డైరెక్టర్ భర్త లక్ష్మణ్, వార్డ్ మెంబర్ కర్రె సాయిలు, ఎల్లమ్మ ఆలయం కర్త కీర్తి సురేష్, కీర్తి శేషులు శ్రీరాముల కుమారుడు అంజన్న, కమ్మరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు రంజాన్ కానుకలు పంపిణీ

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని కల్‌బెమల్‌లో పేద ముస్లిం సోదరులకు రంజాన్ గిఫ్ట్ ప్యాక్‌ను బీఆర్ఎస్ వైస్ ప్రెసిడెంట్, కల్ బేమల్ సర్పంచ్ మహిపాల్ గ్రామ నాయకుల ఆధ్వర్యంలో పేద ముస్లిం సోదరులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రంజాన్ పండుగకు గిఫ్ట్ ప్యాక్‌లు ఇవ్వడం సంతోషమన్నారు. మైనార్టీల కోసం ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు. ఉప సర్పంచ్ అశోక్ పాటిల్, గ్రామ నాయకులు అబ్దుల్ రెహ్మాన్, శంకర్, మైనార్టీలు గ్రామస్తులు ఉన్నారు ..



వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్‌లో నివసిస్తున్న ఉదయ్‌కుమార్ సింగ్ అనారోగ్యంతో బాధపడుతు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకుని దీనానాథ్ సందీప్ షా.. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి తెలియజేశారు. దీంతో ఆయన తక్షణ వైద్య ఖర్చులకు కోసం రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సహాయం చేసినందుకు బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు.



మాజీ సర్పంచ్ వెంకటేశం సేట్‌కు పరామర్శ

నవతెలంగాణ-కల్హేర్

నిజాంపేట మండలంలోని నాగ్‌దార్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కల్హేర్ మండల వైశ్య సంఘం అధ్యక్షులు వెంకటేశం సెట్ ఇటీవల అనారోగ్యానికి గురై హైదరాబాదులోని యశోద హాస్పిటల్ లో చికిత్స పొంది కోలుకొని సంగారెడ్డిలో ని కుమారుడి ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న కృష్టాపూర్ సర్పం చ్ కిష్టారెడ్డి, ఎంపీటీసీ గుండమ్మ అంజయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ రామ్‌రెడ్డి బుధవారం సంగారెడ్డిలోని తన కుమాడిని ఇంటికి వెళ్లి వెంకటేశం సేట్‌ను పరా మర్శించి.. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకు న్నారు. ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. వార్డ్ మెంబర్ మల్లేశం, కుటుంబ సభ్యులు ఉన్నారు.

శానిటేషన్ నిర్వహణపై కలెక్టర్ ఆగ్రహం

- రోగులకు ఇబ్బందులు కలిగించొద్దు
- మంచినీరు అందుబాటులో ఉంచాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



నవతెలంగాణ-జోగిపేట

జోగిపేట వంద పడకల ప్రభుత్వసుపత్రిలో శానిటేషన్ నిర్వహణ తీరుపై సంగారెడ్డి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. శరత్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రమేష్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం ఆయన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. శానిటేషన్ విషయంలో తీరు మారడం లేదని, సంబంధిత కాంట్రాక్టర్ ను పిలిపించి మాట్లాడాలని ఆయన హెచ్చరించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు తాగు నీరు అందుబాటులో లేకపోవడంతో ఆయన మండిపడ్డారు. ఆసుపత్రిలో ప్రతి వార్డు తిరుగుతూ రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రికి రోగులు ఆరోగ్యం బాలేక ఎంతో మంది పేద ప్రజలు వస్తుంటారని ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిసున్నారని ఎందుకు శానిటేషన్ నిర్వహణ సరిగ్గా చేపట్టడం లేదని మండిపడ్డారు. ఆసుపత్రిలో ఓపి వద్ద రోగులు నిల్చొని లైన్ కట్టడంతో వారికి కుర్చీలు ఎందుకు ఏర్పాటు చేయ లేదని కలెక్టర్ అధికారులు, డాక్టర్లను ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రికి నీరుపేదలు ఎంతో మంది వైద్యం కోసం వస్తుం టారని వారికి కనీస సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. అధికారులు సిబ్బంది తీరు మార్చు కాకుంటే చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో మళ్ళీ ఆసుపత్రి విజిట్ కు వస్తానని తీరు మారకుంటే నోటీసులు జారీ చేస్తానని కలెక్టర్ అన్నారు. ఆయన వెంట ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ వెంకటేశం తదితరులు ఉన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి



- దళితుల భూముల జోలికి వెళ్తే ఖబర్దార్
- సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శిపై తాసిల్దార్ దురుసు ప్రవర్తన సరికాదు
- సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నవతెలంగాణ- సదాశివపేట

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పేరుతో రైతుల ఆమోదం లేకుండా భూమిని గుంజుకోవడానికి ప్రయత్నం చేస్తే కచ్చితంగా అడ్డుకుంటామని.. బలవంతపు భూ సేకరణను వెంటనే ఉపసంహరించుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సదాశివపేట పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర రైతులతో సమావేశం నిర్వహించి ఎమ్మెల్యే మాట్లాడారు. పట్టణంలోని 165 సర్వే నెంబర్‌లో ఎన్నో ఏండ్ల నుంచి దళితులు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అలాంటిది అభివృద్ధి పేరిట వారి భూములను లాక్కోవాలని చూస్తే.. వారు ఏ విధంగా జీవిస్తారని ప్రశ్నించారు. భూమి విలువ పెరిగిందని దళితులైన అమాయక ప్రజల వద్ద ప్రభుత్వం ఇలా భూములు తీసుకోవాలనుకోవడం సరికాదన్నారు. దళితులకు మూడు ఎకరాలు భూమి ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడేమో దళితుల భూములను తీసుకోవడం అన్యాయమన్నారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకుండా రైతుల ప్రయోజనాలను కాపాడాలన్నారు. రైతులు పక్షాన మాట్లాడుతున్న సీపీఐ(ఎం) సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్ కుమార్‌పై తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపాలని ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో 70 ఏండ్ల నుంచి కబ్జాలో ఉండి సాగు చేసుకుంటున్న దళితుల భూముల పై రాష్ట్ర ప్రభుత్వం కన్ను పడిందన్నారు. అభివృద్ధి పేరుతో దళితుల భూములు గుంజుకోవడం తీవ్ర అన్యాయమన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమావేశం పెట్టి.. స్థానిక తాసిల్దార్, అధికారులు అతి ఉత్సాహంగా ప్రదర్శించారని.. రైతుల సమావేశానికి ఎవరిని రానీయకుండా లోపలే వారితో సంతకాలు తీసుకోవడం దుర్మార్గమన్నారు. ఎలాంటి ప్రకటనలు చేయకుండా, నోటీసులు ఇవ్వకుండా భూములు ఇవ్వాలని అడగడం సమంజసం కాదన్నారు. ఒక అఖిల భారత పార్టీ నాయకుడైన తనపై తాసిల్దార్ అధికారులు దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. తాము రైతుల పక్షాన ఉండడంతో ఆయనకు మింగుడు పడడం లేదన్నారు. తాసిల్దార్ అధికారులు ప్రవర్తనను జిల్లా కలెక్టర్, మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి, చిరంజీవి, అరుణ్ పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-జోగిపేట

మండల పరిధిలోని అక్సనిపల్లి గ్రామానికి చెందిన గంజి వీరయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షులు అదిలాబాద్ రమేష్ మృతుని స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సంతపాన్ని తెలియజేశారు. అంత్యక్రియల నిమిత్తం వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

గుమ్మడిదల : మండలంలోని వీరన్నగూడెం గ్రామానికి చెందిన తుజాల్ పూర్ నర్సింలు అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, చిట్కుల్ సర్పంచ్ నీలం మధు.. మండల ముదిరాజ్ సంఘం నాయకుల చేతుల మీదుగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎన్.ఎం.ఆర్ యువసేన నాయకులు తుజాల్ పూర్ వీరేశ్, చింతల వీరేశ్, మాజీ వార్డు సభ్యురాలు రంగమ్మ, దేవుని చెరువు నర్సింలు, విజయకుమార్, సత్యనారాయణ, కుమార్, శేఖర్, విజయ కుమార్, దాస్, సురేష్, సత్యనారాయణ, రాజు, అలీమ్ తదితరులు పాల్గొన్నారు.





బీహార్ రాష్ట్రం నుంచి జీవనోపాధి కోసం గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి గ్రామానికి వలస వచ్చిన సునీల్ అనే వ్యక్తి హార్ట్ ఎటాక్‌తో మృతిచెందాడు. మృతుని కుటుంబానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ.. ఆ కుటుంబానికి గ్రామ బీఆర్ఎస్ నాయకుల చేతుల మీదుగా పదివేల ఆర్థిక సాయం అందజేయించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సంజీవ రెడ్డి బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు ముద్దంగుల గోపాల్, నాయకులు సప్పటి మహేష్, బిక్షపతిరెడ్డి, దిల్లేశ్వరరావు, సునీల్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై దాడికి నిరసనగా ర్యాలీ



నవతెలంగాణ-సంగారెడ్డి

రాజేంద్రనగర్ న్యాయవాది ఎ.రవికాంత్ రెడ్డిపై జరిగిన దాడిని నిరసిస్తూ.. సంగారెడ్డి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ సాగింది. అనంతరం సంగారెడ్డి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ న్యాయవాది ఎ. రవికాంత్ రెడ్డి పై కోర్టు ప్రాంగణంలో దాడి చేయడం తీవ్రంగా ఖండించదగ్గ విషయమున్నారు. కోర్టు ప్రాంగణాల్లో, రోడ్లపైన దాడులు చేయడం న్యాయ వ్యవస్థ పై జరుగుతున్న దాడిగా పరిగణించాలన్నారు. దీనిని అరికట్టాలంటే న్యాయవాదుల కోసం ప్రత్యేక రక్షణ చట్టం వెంటనే తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనికోసం న్యాయవాదులు మరో ఉద్యమానికి శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. గతంలో దేశ స్వాతంత్రం కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించి సాధించామన్నారు. ప్రస్తుతం ఈ ఉద్యమం మనకోసం, మన రక్షణ కోసం జరుగుతున్న పోరాటం అని అన్నారు. కావున అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎ.మహేశ్, ప్రధాన కార్యదర్శి ఎన్.క్రిష్ణ, కార్యదర్శి ఎ.బాలాజ్, కోశాధికారి వి.రాంరెడ్డి, క్రీడల కార్యదర్శి మాణికె రెడ్డి, గ్రంథాలయ కార్యదర్శి బి.శ్రీనివాస్, మహిళా ప్రతినిధి అరుణ కుమారి, కార్యవర్గ సభ్యులు డి.రాంరెడ్డి, దయాకర్‌రెడ్డి. జుల్ఫేకర్, పి.సురేందర్, సతీష్ యాదవ్, కె.రాములు, న్యాయవాదులు ఆర్.శ్రీనివాస్, కేఎస్. భాస్కర్, దశరథ్ రాజశేఖర్ రెడ్డి, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-కొండాపూర్

మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన వెంకటేశం కుమారుడు మణి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం పట్నం ఫౌండేషన్ దృష్టికి రావడంతో.. బాధిత కుటుంబానికి రూ.20 వేల సాయాన్ని పట్నం రవితేజ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకులు పాల్గొన్నారు.



గొల్ల కురుమల ఆర్థిక స్వావలంబనకే గొర్రెల పంపిణీ

- ప్రతి లబ్ధిదారుడు తమ వాటా మొత్తాన్ని సకాలంలో చెల్లించాలి
- నియోజకవర్గ స్థాయి గొల్ల కురుమల సహకార సంఘం సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

దేశంలోనే మొట్టమొదటిసారిగా గొల్ల కురుమల ఆర్థిక స్వావలంభన కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రవేశపెట్టారని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. త్వరలో చేపట్టనున్న రెండో విడత గొర్రెల పంపిణీ పథకం అంశంపై బుధవారం ఉదయం పటాన్‌చెరు మండలం పార్టీ గ్రామ పరిధిలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో నియోజకవర్గస్థాయి గొర్రెల పెంపకం దార్ల సహకార సంఘం సభ్యులు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే జరిపిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ పరిధిలో మొత్తం 1509 మంది సభ్యులు సహకార సంఘంలో సభ్యత్వ నమోదు చేసుకున్నారన్నారు. వీరిలో ఇప్పటివరకు 500 మంది మాత్రమే సబ్సిడీ మొత్తాన్ని చెల్లించడం జరిగిందని తెలిపారు. 20 మేకలు ఒక పొట్టేలు కూడిన యూనిట్ ధర ఒక లక్ష 75 వేల రూపాయలు కాగా సభ్యుడు రూ.43,750 చెల్లించాలని, ప్రభుత్వం ఒక లక్ష 31 వేల 350 రూపాయలు సబ్సిడీ చెల్లిస్తోందన్నారు. ప్రతీ సభ్యుడు తమ వాటా చెల్లించేలా సంఘం అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు పూర్తిస్థాయి బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈనెల 28 లోపు 100% చెల్లింపులు జరగాలని అధికారులను ఆదేశించారు. గుమ్మడిదల, జిన్నారం మండలాల పరిధిలో గొర్రెలను మేపే సమయంలో అటవీ శాఖ అధికారులతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని రాగా, త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పూర్తి స్థాయిలో చెల్లింపులు జరిగిన అనంతరం త్వరితగతిన యూనిట్లు అందించేలా జిల్లా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ పథకాన్ని ప్రతి సభ్యుడు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా పరిపుష్టి చెందాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, డి ఆర్ డి ఎ పి డి శ్రీనివాస్ రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ వసంత కుమారి, గొల్ల కురుమల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు నగేష్, ఎంపీపీలు సుష్మా శ్రీ వేణుగోపాల్ రెడ్డి, ప్రవీణ విజయభాస్కర్ రెడ్డి, జడ్పీటీసీలు సుధాకర్ రెడ్డి, సుప్రజా వెంకట్ రెడ్డి, కుమార్ గౌడ్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, కార్పొరేటర్లు పుష్ప నగేష్, మెట్టు కుమార్ యాదవ్, పటాన్‌చెరు వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ మల్లారెడ్డి, ఎంపిడిఓలు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేష్ గౌడ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

3వ రోజుకు ఐకేపీ వీఓఏల సమ్మె







నవతెలంగాణ-జోగిపేట

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకెపి వివోఏలు చేపడుతున్న నిరసన సమ్మె బుధవారానికి మూడోరోజుకు చేరింది. ఈ సందర్భంగా జోగిపేట స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన సమెత్లో వీవోఏలు కూర్చుని వారి సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేశారు. ఈ నిరసనలో వీవోఏల జిల్లా కోశాధికారి మల్లన్న, ఆంజనేయులు, విజయ, సునీత, కవిత, స్వప్న, లక్ష్మీ హర్ష, మానస, చంద్రిక, అనిత తదితరులు పాల్గొన్నారు.

న్యాల్‌కల్ : మండల ఐకెపి కార్యాలయం ఎదుట వీవోఏలు మూడోరోజు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమకు కనీస వేతనం తోపాటు ప్రభుత్వ ఉద్యోగాలుగా గుర్తించి, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. వీఓఏలు మండలాధ్య క్షుడు నాగేందర్, నాగరాణి, శివకుమార్, శరణప్ప ఉన్నారు.

గుమ్మడిదల : అర్హులైన ఐకెపి వీవోఏలను సీసీలుగా ప్రమోషన్లు కల్పించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు పలు డిమాండ్‌ల సాధనకు మండల కేంద్రంలో వీవోఏలు నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నారు. గ్రామాలలో ఐకెపి ద్వారా చేస్తున్న వడ్ల కొనుగోలుతో పాటు వివిధ పనులను నిర్వహిస్తున్నామన్నారు. తమ డిమాండ్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వీవోఏల సంఘం అధ్యక్షురాలు మాధవి, ఉపాధ్యక్షులు కల్పన, కార్యదర్శి విధయ, ట్రెజరర్ విజయలక్ష్మి, సహాయ కార్యదర్శి లక్ష్మి పాల్గొన్నారు.

పరిశ్రమకు వ్యతిరేకంగా 13వ రోజు నిరసన

నవతెలంగాణ-హత్నూర

వడ్డేపల్లి గ్రామ శివారులో సురభి కెమికల్ కంపెనీ నిర్మాణం ఆపాలని గత 13 రోజులుగా దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్షలకు వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ రాష్ట్ర నాయకులు, యుద్ధనౌక ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న పాల్గొని తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. తమ ఆటపాటతో పరిశ్రమ యాజమాన్యాన్ని తప్పు బట్టారు. తాము కంపెనీలకు వ్యతిరేకం కాదని.. కానీ వ్యవసాయానికి పనికి రాని భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేసారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదంలో పడేసే ఈ కెమికల్ కంపెని అనుమతులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసారు. పరిశ్రమ నిర్మాణం ఆపాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు యాదవ రెడ్డి, రాజయ్య, శేఖర్ పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముక్కగల్ల స్వరూప, ఉపసర్పంచ్ సురేష్ గౌడ్ మాజీ జడ్పీటీసీ సభ్యులు శశికలమ్మ, ఇంద్రమ్మ,వార్డు మెంబెర్ యాదయ్య,సదుల్లానగర్ మాజీ సర్పంచ్ కృష్ణ వివిధ గ్రామాల మహిళలు గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-కల్హేర్

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కల్హేర్ ఎంపీపీ అధ్యక్షులు గుబ్బిపు సుశీల అంజయ్య, జెడ్పీటీసీ నరసింహారెడ్డి అన్నారు. కల్హేర్ మండలంలోని మసన్‌పల్లి, నిజాంపేట మండలంలోని కాలువని కుంటతాండ గ్రామాల్లో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు క్యాంపు శిబిరాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం కంటి పరీక్ష నిర్వహించే విధానాన్ని పరిశీలించి.. మొదట కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగా సంపూర్ణ అంధత్వ నిర్మూలనకు కంటి వెలుగును తీసుకువచ్చిందన్నారు. కాబట్టి 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చీటీ కమలమ్మ, జోష్న రమేష్, మండల వైస్ ఎంపీపీ నారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ సంగారెడ్డి, మాజీ ఆత్మ కమిటీ చైర్మెన్ దిలీప్, మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, ఉపసర్పంచ్ రామ్ జోషి, మండల వైద్యా ధికారులు డాక్టర్ స్టాలిన్ జోన, అనిల్ రెడ్డి, క్యాంపు మెడికల్ ఆఫీసర్లు పవన్ కళ్యాణ్, అశోక్, పంచాయతీ కార్యదర్శిలు విక్రమ్, వేణుగోపాల్, సిహెచ్ఓ ఏక్నాతం, మండల హెల్త్ సూపర్వైజర్లు మాణిక్యం, అర్థమాట్రిస్ట్ లక్ష్మీనారాయణ, గీత తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు పేదలకు ఓ వరం

నవతెలంగాణ-కల్హేర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఓ వరం లాంటిదని సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ విజయకుమార్, అంతర్‌గావ్ సర్పంచ్ రవీందర్ పటేల్ అన్నారు. అంతర్‌గావ్‌లో కొనసాగుతున్న కంటి వెలుగు క్యాంపు శిబిరాన్ని బుధవారం వారు వేర్వేరుగా సందర్శిం చారు. అనంతరం రిజిస్ట్రేషన్ మరియు కంటి పరీక్షలు నిర్వహించే విధానాన్ని పరిశీలించారు. కంటి పరీక్షలు నిర్వహించిన కండ్ల అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ అంధత్వ నివారణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. ఈ పథకం ద్వారా ఉచితంగా పరీక్షించడమే కాకుండా ఉచితంగా కండ్ల అద్దాలను కూడా అందజేస్తారన్నారు. కాబట్టి 18 ఏండ్లు నిండిని ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంపు మెడికల్ ఆఫీసర్ శ్రీరంగం నాథ్, పిహెచ్ఎన్ నిర్మల, మండల హెల్త్ సూపర్వైజర్ సుగుణ, ఆర్థమాట్రిస్ట్ సరిత, ఎంపీహెచ్ఏ రామ్ చందర్, ఏఎన్ఎంలు కృష్ణవేణి, సురేఖ, పిహెచ్‌సిడిఈఓ మీనా, క్యాంపు డీఈవో ప్రవీణ్, ఆశా కార్యకర్తలు లక్ష్మీ, స్వప్న, అంగన్వాడీ కార్యకర్తలు మీనా, సురేఖ తదితరులు పాల్గొన్నారు.





సుడా చైర్మన్‌ను సన్మానించిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-సిద్ధిపేటరూరల్

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు సిద్దిపేట రూరల్, అర్బన్, నారాయణ రావుపేట మండలంలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనాలను అహర్నిశలు కృషి చేసి విజయ వంతం చేసినందుకు సిద్దిపేట సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్ రెడ్డిని నారాయణరావుపేట బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుండుగాడి ప్రభాకర్ సన్మానించారు. అనంతరం సుడా చైర్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్, హరీశ్‌రావు పిలుపుమేరకు ప్రతి కార్యకర్త ఆత్మీయ సమ్మేళనను పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సత్యనారాయణ గౌడ్, ఉప సర్పంచ్ స్వామి, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ ఆర్థిక సాయం



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని చండీ గ్రామానికి చెందిన పలు బాధిత కుటుంబాలకు బుధవారం శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. చండీ గ్రామానికి చెందిన ఉప్పరి మహేందర్ అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే గ్రామానికి చెందిన వెంకట్ గౌడ్ మరణించడంతో వారి కుటుంబ సభ్యుల పరామర్శించి జెడ్పీటీసీ పబ్బమహేష్ గుప్తా రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లం, మాజీ ఎంపిటిసి వెంకటేశ్వరరావు, గ్రామ శాఖ అధ్యక్షులు ముత్యం రెడ్డి, బాల్ రెడ్డి, భాస్కర్ గౌడ్‌లు ఉన్నారు.

వీఓఏలకు కనీస గుర్తింపు కరువైంది



నవతెలంగాణ-మెదక్ రూరల్

ప్రభుత్వం సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేర్చి, మహిళా సంఘాల అభివృద్ధికి నిత్యం కృషి చేస్తున్నా తమకు కనీస గుర్తింపు కరువైందని వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ కలెక్టరేట్ ముందు వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండోరోజు కొనసాగింది. ఈ సందర్భంగా వీఓఏలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థాయిలో ఉన్న చిన్న సంఘాలను బలోపేతం చేస్తున్నాం, పేదరికంలో మహిళలను గుర్తించి వారికి అందాల్సిన సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీకి సంబంధించిన పనులు చేస్తున్నామన్నారు. సెర్ప్‌లో పనిచేస్తున్న తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే బీమా సౌకర్యం కల్పించాలని, ఉన్నత విద్యనభ్యసించిన వారికి ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్, ప్రధాన కార్యదర్శి స్వరూపరాణి, కోశాధికారి కవిత,అశోక్ యాదవ్, గంగాపురం వెంకన్న, అశోక్, దశరథ్, శ్రీశైలంలతోపాటు జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పార్టీకి పట్టు కొమ్మలు కార్యకర్తలు

- గజమాల దండ, కార్యకర్తలకు కొండత అండ
- ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి





నవతెలంగాణ-పాపన్నపేట

బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టు కొమ్మలని, వారి కష్ట సుఖాలలో బీఆర్ఎస్ పార్టీ కొండంత అండగా నిలుస్తుందని మెదక్ శాసన సభ్యురాలు పద్మా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుదవారం మండల కేంద్రమైన పాపన్నపేటలో మంజీరా గార్డెన్‌లో రెండవ విడత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ బోరుబావుల వద్ద మీటర్లు బిగిస్తే వచ్చే బిల్లుల ద్వారా రాష్ట్రానికి కోట్లు ఇస్తామని చెబితే మీ కోట్లు వద్దు మా రైతులకు నష్టం చేసే మీటర్లు వద్దు అని రైతు సంక్షేమం కోసం కేసీఆర్ కృషి చేస్తున్నారన్నారు. అబ్కిబార్ కిసాన్ సర్కార్ అన్ నినాదంతో ముఖ్యమంత్రి కెసిఆర్ ముందుకు వెళుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గురుమూర్తి గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు జగన్, ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు కుబేర్, రైతు బంధు జిల్లా అధ్యక్షులు సోములు, నాలుగు రాష్ట్రాల ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్ రెడ్డి, పాపన్న పేట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రెడ్డి , పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటేశం, సర్పంచులు రాణి కిష్టయ్య ప్రమీల గోపాల్ రెడ్డి, బుజ్జమ్మ అషయ్య, కవిత రవీందర్, వెంకట్ రాములు, మల్లేశం, స్రవంతి శ్రీనివాస్, కిషన్, సుదర్శన్, లింగా రెడ్డి, సంగప్ప, తిరుపతి రెడ్డి, నవీన్, లక్ష్మి దుర్గయ్య, దాసు, మండల కోఫ్షన్ సభ్యులు గౌస్, ఏడుపాయల చైర్మన్ బాలా గౌడ్, దానయ్య, అంజయ్య, కో ఆపరేటివ్ చైర్మన్లు మల్లేశం, దత్తు రాజ్, మాజీ పాలక మండలి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు దుర్గయ్య, సుభాష్ గౌడ్, ఇమానియల్, బాబా గౌడ్, బాబర్, తోపాటు వివిధ గ్రామాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెండో విడతలో 318 యూనిట్లు



నవతెలంగాణ-పెదశంకరంపేట

రెండో విడత గొర్రెల అభివృద్ధి పథకం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జంగం శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో అధికారులతో మాట్లాడారు. కొత్తగా మండలంలో 318 యూనిట్లను ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ డి యఫ్ ఓ, రవి ప్రసాద్, మండల తహసీల్దార్ చరణ్ సార్, వెటర్నరీ డాక్టర్, ఎంపీఓ, యఫ్ ఆర్ ఓ వికాస్, ఎంపీటీసీ సుభాష్ గౌడ్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు దత్తు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కుంట్ల రాములు, యూనియన్ బ్యాంకు, ఎస్ బి ఐ ప్రతినిధులు, మండలంలోని అన్ని గ్రామాల గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్ పెండింగ్ రైస్‌ను నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలి



జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-కొల్చారం

సీఎంఆర్ పెండింగ్ రైస్‌ను నెలాఖరులోగా ఎఫ్‌సీఐకి అప్పగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. బుధవారం కొల్చారం మండలంలోని రాంపూర్ గ్రామ శివారులో ఉన్న మంజీరా పారాబాయిల్డ్ రైస్ మిల్లును ఆకస్మికంగా సందర్శించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2021-22 యాసంగికి సంబంధించి సీఎంఆర్ పెండింగ్ రైస్‌ను ఈ నెలాఖరులోగా ఎఫ్.సి.ఐ. కి అప్పగించాల్సి ఉన్నందున, పెండింగ్‌లో ఉన్న ధాన్యాన్ని రోజువారీగా మరాడించి నిర్ణీత గడువులోగా పంపాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అదేవిధంగా ప్రస్తుత యాసంగికి సంబంధించి రైతులకు ఎటువంటి తరుగు లేకుండా ధాన్యం తీసుకొని భద్రపరచుటకు స్థలం ఏర్పాటు చేసుకోవాలని, హమాలీలను ఎక్కువగా పెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ రమేష్, ఆర్డీవో సాయిరాం, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, ఎంపిడిఓ గణేష్ రెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ -పాపన్నపేట

మద్యానికి బానిసైన ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని దౌలాపూర్ లో చోటు చేసుకుంది. ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన జలగరి రమేష్ (35) కూలీ పనులు చేసుకుంటూ గడుపుతున్నాడు. ఇటీవల అనారోగ్యంతో బాధ పడుతూ మనోవేదనతో మద్యానికి బానిసగా మారాడు. దీంతో తరచూ భార్య శివలక్ష్మీతో తరచూ గొడవ పడేవాడు. పలుమార్లు చనిపోతానని బెదిరించేవాడు. ఈ నెల 17న భార్య శివలక్ష్మీ పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో రమేష్ మంగళవారం రాత్రి ఇంట్లో ఓ చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన బంధువులు గమనించి మృతుడి భార్యకు సమాచారం అందించారు. బతికి ఉన్నాడేమో అని చికిత్స నిమిత్తం మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు..

పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

మండలంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలనీ కోరుతూ ఎంపీపీ జంగం శ్రీనివాస్, మండల స్పెషల్ ఆఫీసర్ రవి ప్రసాద్‌కు పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై సమీక్ష



నవతెలంగాణ-నిజాంపేట

నిజాంపేట మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఇన్చార్జి ఎంపీడీవో రాజేందర్, ఎంపీపీ సిద్దరాములు ఆధ్వర్యంలో రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ ఫలాలను అందించాలనే ఉద్దేశంతో ముందుకెళ్తుందన్నారు. గొల్ల కురుమ కులస్తులకు ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతగొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. అవకాశాన్ని గొల్ల కురుమ కులస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఎల్పిఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ గంగా ప్రసాద్, మిషన్ భగీరథ ఏఈ బిక్షపతి, ఆయా గ్రామాల సర్పంచులు అమరసేనారెడ్డి, నిజాంపేట సర్పంచ్ అనూష లక్ష్మీనరసింహులు, ఎంపిటిసి లహరి రెడ్డి, గ్రామ కార్యదర్శిలు ఆరీఫ్ హుస్సేన్,ప్రశాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణ లక్ష్మీ చెక్కు పంపిణీ



నవతెలంగాణ-టేక్మాల్

తహసీల్దార్ కార్యాలయంలో ఎంపీపీ చింతా స్వప్న రవి గ్రామ సర్పంచ్‌లు సుప్రజా భాస్కర్, కవిత అశోక్ తహసీల్దార్‌లు హర్దిప్ సంగ్‌లు లబ్దిదారులకు బుధవారం కల్యాణ లక్ష్మీ చెక్‌లను అందజేశారు. కమ్మరి కత్త గ్రామానికి చెందిన హరిజన్ సురేందర్, గీతలకు రూ.100116ల చెక్‌ను అందజేశారు.

ఘనంగా చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు





నవతెలంగాణ-నార్సింగి : నార్సింగి మండల కేంద్రంలో దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు మెదక్ జిల్లా డీసీసీ నాయకులు యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి యాదవ్ శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరి యాదవ్ మాట్లాడుతూ రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, బడుగు బలహీవర్గాలకు మేలు జరగాలన్నా రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణ మాఫీ జరగాలన్నా, పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఐదు లక్షల ఆర్థిక సహాయం కావాలన్నా కచ్చితంగా కాంగ్రెస్ ప్రభుత్వమే రావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జిల్లా నాయకులతో పాటు నార్సింగి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోవర్ధన్, సీనియర్ నాయకులు ఆకుల శ్రీనివాస్, పట్టణ అధయక్షుడు కుమ్మరి రవీందర్, మైనారిటీ నాయకుడు గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-రాయపోల్ : దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రాయపోల్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దుబ్బాకలో చెరుకు శ్రీనివాస్ రెడ్డిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఎల్లప్పుడు ప్రజల పక్షపాతి అని, రాహుల్ గాంధీ జోడో యాత్ర స్ఫూర్తితో దుబ్బాక నియోజకవర్గంలో హాత్ సే జోడోయాత్ర పేరుతో గ్రామ గ్రామాన తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తప్పేట సుధాకర్, కృష్ణ గౌడ్, అనిల్ గౌడ్,దయాకర్, దయాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, కర్ణకర్, జనార్దన్ రెడ్డి,కిషన్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ



నవతెలంగాణ-నిజాంపేట

నియోజకవర్గ అభివృద్ధి నిధుల (సీడీపీ) నుంచి మంజూరు చేసిన రూ.7.5 లక్షలతో చేపట్టిన బీసీ (ముదిరాజ్) కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్సీకి గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు ఘన స్వాగతం పలికి పెద్దమ్మ తల్లి ఆలయానికి తీసుకువెళ్లి దర్శనం చేయించారు. ముదిరాజ్ సంఘం నాయకులు మరిన్ని నిధులు కావాలని కోరగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.7.5 లక్షలు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి పుట్టి అక్షయ్, సర్పంచ్‌లు శివ ప్రసాద్ రావు, నాగరాజు, ఎంపీటీసీ రాజా రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ లింగం, పీఏసీఎస్ డైరెక్టర్ రవీందర్ రెడ్డి, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మెట్టు సిద్దిరాములు, నాయకుడు గుంల మైసయ్య, మత్స్యకార సంఘం అధ్యక్షుడు మెట్టు వెంకటేశం, ఉపాధ్యక్షుడు పిట్ల మహేష్, నాయకులు గుంల కర్రయ్య, బీఆరెస్ నాయకులు బాబు, తిరుపతి, ఉప సర్పంచ్ సంజీవులు, మల్లేష్ యాదవ్, రంజిత్ రాజ్, తదితరులు ఉన్నారు.

204 సర్వే నెంబర్‌ను జాయింట్ సర్వే నిర్వహించాలి

- 574 ఎకరాలను ఫారెస్ట్, రెవెన్యూ సర్వే నిర్వహించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించాలి
- అధికారులకు ఆదేశాలు జారీచేసిన కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ- చిలిపిచెడ్

చిలిపిచెడ్ మండలం గౌతపూర్ శివారు గన్య తండాలోని 204 సర్వే నెంబర్‌ను రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు త్వరితగతిన జాయింట్ సర్వే నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజార్షి షా ఆదేశించారు. బుధవారం చిలిపిచెడ్ తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ రమేష్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించి రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 204 సర్వే నెంబర్‌లో 574 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, అందులో 96 మంది రైతులు కాస్తులో ఉన్నట్లు తెలిపారు. వారికి త్వరితగతిన పట్టాలు ఇచ్చేందుకు రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలన్నారు. అందుకు సంబంధించిన రికార్డులను ఇప్పటికే పరిశీలించామని రైతులు ఓపికతో ఉండాలన్నారు. అదేవిధంగా వరి కోతలు ప్రారంభిస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు త్వరలో ప్రారంభించేలా చూడాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ముశాదిక్, జెసి సీసీ కిశోర్, డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శ్ కుమార్, వైస్ విశ్వంభర స్వామి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షురాలు లక్ష్మి దుర్గారెడ్డి తదితరులు ఉన్నారు.


24న విద్యా సంవత్సర చివరి పని దినం

నవతెలంగాణ-మెదక్ రూరల్

విద్యా సంవత్సరం చివరి పనిదినమైన ఈ నెల 24 న జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జిల్లా పరిషత్ మండల పరిషద్ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో పోషకుల సమావేశాలు నిర్వహించి విద్యార్థులకు ప్రగతి నివేదికలు అందజేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్ తెలిపారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. 24న గ్రామంలోని ప్రజాప్రతినిధులందరిని ఆహ్వానించి ఈ సంవత్సరం విద్యార్థి, విద్యార్థులు ఎఫ్.ఎల్.యెన్. కార్యక్రమం ద్వారా సాధించిన ప్రగతిని పోషకుల ముందు విద్యార్థులచే ప్రదర్శించాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులందరూ వచ్చే విద్యాసంవత్సరంలో మరింత ప్రగతి సాధించడానికి పోషకులు ఏంచేయాలి, దానికి పాఠశాల ఏ విధంగా సహాయపడుతుందో వివరించాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరం అకాడమిక్ ప్లానింగ్ గురించి కూడా చర్చించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పోషకుల సమావేశంపై ఉదయం 7.30 గంటలకు జరిపే విధంగా చర్యలు తీసుకుంటూ పోషకులు, ఎస్.ఎం.సి. సభ్యులు, స్థానిక ప్రజా ప్రతినిధులకు ముందుగానే రాతపూర్వక సమాచారం విద్యార్థుల ద్వారా తెలపాలని సూచించారు.

చేపల వేటకు వెళ్ళి శవమై తేలాడు





నవతెలంగాణ-నార్సింగి

నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. శేరిపల్లి గ్రామానికి చెందిన చెయ్యాల గంగారాం (60) సంవత్సరాలు మంగళవారం ఉదయం సుమారు 10 గంటల ప్రాంతంలో లో చేపల వేటకని స్థానిక గుండు చెరువుకు వెళ్లాడు, రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ తెలియక పోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేద్దామని అనుకుంటుండగా, బుధవారం సాయంత్రం 5 గంటల 30 నిముషాల ప్రాంతంలో చెరువులో శవమై తేలాడు. మృత దేహంతో పాటు గాలానికి చిక్కిన చేప కూడా లభ్యమైంది. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు వెంటనే బయలుదేరి శవాన్ని నీటిలో నుంచి తీసి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీని గద్దె దించండి.. దేశాన్ని రక్షించండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి



నవతెలంగాణ-తొగుట, మిరుదొడ్డి

మతతత్వ పార్టీ బిజెపిని గద్దె దించాలని, దేశాన్ని రక్షించుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యు లు చాడ వెంకటరెడ్డి అన్నారు.మంగళవారం తొగుట, మిరుదొడ్డి మండల కేంద్రాలలో పల్లె పల్లెకు సీపీఐ, ప్రజల వద్దకు సిపిఐ అనే ప్రజా చైతన్య యాత్ర మండల కేంద్రాలకు చేరుకుంది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతూ మతతత్వాన్ని రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ప్రజలపై రెండు రకాలుగా దాడులు జరుగుతున్నాయని మండిపడ్డారు. ఇందులో ఒకటి ఆర్ఎస్ఎస్ భావ జాలం మత విద్వేషాలు రెచ్చగొడుతూ మైనార్టీలను, దళితులను అణచివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు నయా సరళీకృత ఆర్థిక విధానాలు సెరవేగంగా అమలుపరుస్తూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థ నుంచి దేశాన్ని పెట్టుబడిదారీ వ్యవస్థకు మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ బాబా సాహెబ్ రూపొందించిన రాజ్యాంగాన్ని దేశ ఆర్థిక సామాజిక స్వేచ్ఛ పౌరుల హక్కులను రక్షణ కల్పిస్తూ పాలకులు దుష్ట ఆలోచన వల్ల అసలుకే ముప్పు ఏర్పడుతుందన్నారు. బడుగు బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జరగటం లేదన్నారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సిపిఐ కార్య దర్శి మంద పవన్, సీపీఐ నాయకులు శివలింగ కృష్ణ, సదానందం, మహిళా రాష్ట్ర నాయకులు పద్మ, లక్ష్మి, మల్లక్క, గజ్వేల్ నాయకులు చింత శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మణికంఠ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీలో చెరగని ముద్ర వేసిన కాన్గల్ శ్రీనివాస్ గౌడ్

ఆయన మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటు.



నవతెలంగాణ-తొగుట

మరుపల్లి శ్రీనివాస్ గౌడ్ తెలంగాణ ఉద్యమంలో తొగుట మండలంలో ఇతని పేరు తెలియని వారు ఉండరంటే అతిశయోక్తికాదు.. కాన్గల్ గ్రామానికి చెందిన మరుపల్లి శ్రీనివాస్ గౌడ్ (43) టీడీపీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తూ తెలంగాణ ఉద్య మానికి ఆకర్షితుడై 2001లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరారు. ఆసమయంలో అందె గ్రామంలో చెరుకు ముత్యంరెడ్డి సభను అడ్డుకొని వార్తల్లోకి ఎక్కారు. ఎక్కడ టిఆర్ఎస్ సభ నిర్వహిస్తే అక్కడ శ్రీనివాస్ గౌడ్ కనిపించేవాడు.తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నాడు. వార్డు సభ్యునిగా,రెండు సార్లు విద్యాకమిటీ చైర్మన్‌గా, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, మండల పార్టీ ఉపా ధ్యక్షుడుగా, ప్రధాన కార్యదర్శి గా పనిచేశాడు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ గౌడ్ పొన్నాలలోని తన బంధువుల ఇంటికి కాలినడకన వెళుతూ ప్రమాదవశాత్తు కిందపడి మరణించాడు. ఆయన మరణంతో గులాబీ శ్రేణులు, గ్రామస్తులు, స్నేహితులు విషాదానికి లోనయ్యారు. ఉద్యమ సహచరుడు మరుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఇక లేరనే వార్తను వారు జీర్ణించుకోలేక పోతున్నారు.ఆయన మరణ వార్త తెలుసుకున్న మెదక్ పార్లమెంటు సభ్యులు, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.ఆయన అకాల మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ పక్షాన నివాళి అర్పిస్తున్నామని తెలియజేశారు. మరణవార్త తెలుసుకున్న వెంటనే మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడి పల్లి రాంరెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్యలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. .ఆసుపత్రిలో ఆయన పార్థీవ దేహానికి నివాళి అర్పించారు. పరామర్శించిన వారిలో రైతుబంధు అధ్యక్షుడు బోధనం కనకయ్య, ఎంపీటీసీ వేల్పుల స్వామి, తదితరులు ఉన్నారు. శ్రీనివాస్ గౌడ్ మరణంతో భార్య సుమలత, కుమార్తెలు మణిప్రసన్న, ప్రియదర్శిని, తల్లి భాగ్యమ్మల శోకానికి అంతు లేకుండా పోయింది. బుధ వారం రాత్రి కాన్గల్‌లో శ్రీనివాస్ గౌడ్ అంత్యక్రియలు నిర్వహించారు.

ధాన్యం కొనుగోల్లు పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-మెదక్ రూరల్

ధాన్యం కొనుగోల్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. బుధవారం మెదక్ మండలం రాజ్‌పల్లి గ్రామంలో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రమేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. కేంద్రాల్లో కాంటాలు, తేమను కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్‌లు, టార్పాలిన్లు, గోనె సంచులను అందుబాటులో ఉంచాలని తెలిపారు. రైతులకు క్రమబద్ధీకరణలో టోకెన్లను జారీ చేయాలని, వేసవి దృష్ట్యా కేంద్రాల వద్ద షామీయానా, మంచినీటి సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. తూకంలో తేడా రాకుండా ధాన్యం కొనుగోలు చేసి, ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. రైతులు 17 శాతం తేమ మించకుండా, ఎఫ్ ఏ క్యూ పరిమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని తీసుకొచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. కేంద్రం నుంచి మిల్లులకు లారీలను ట్యాగింగ్ చేసి డీవియేషన్ రాకుండా, మిల్లులకు చేరిన 24 గంటల్లో ధాన్యం దించుకునే విధంగా చూడాలని నిర్వాహకులకు సూచించారు. ప్రజాప్రతినిధుల సమయం తీసుకొని కేంద్రాలను త్వరగా ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తాళ్లు, పొల్లు లేకుండా నాణ్యమైన ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకురావాలని రైతులకు తెలియజేశారు. ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నందున దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ శ్రీనివాస్, ఆర్డీఓ సాయిరాం, తహశీల్దార్ శ్రీనివాస్, ఏఈఓలు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఉన్నారు.

జాండిస్‌తో వ్యక్తి మృతి

నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవాలి

సర్పంచ్ కవిత రవీందర్



నవతెలంగాణ-సిద్దిపేటరూరల్:

జాండిస్ బారిన పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురూకుల గ్రామంలో బుధవారం జరిగింది . గ్రామస్తుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన నీరటి శ్రీకాంత్(32) కూలి పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. గత కొద్ది రోజుల క్రితం ఆరోగ్యం బాగాలేదని సిద్దిపేటలో ప్రైవేటు ఆస్పత్రిలో చూపించుకోగా జాండిస్ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో వైద్యం కోసం డబ్బులు ఖర్చు పెట్టి ఎన్నో ఆసుపత్రులు తిరిగినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఏమి చేయలేక సిద్దిపేటలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లగా వారు పరీక్షలు నిర్వహించి జాండీస్‌తో పాటు కిడ్నీలు కూడా పనిచేయడం లేదని చెప్పారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. మృతునికి భార్య ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నీరటి కవిత రవీందర్ గ్రామస్తులు కోరారు.

మైనార్టీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి



తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ- గజ్వేల్ : మైనార్టీల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారు తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా ప్రభుత్వం తరపున బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం సోదరులకు వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం కూడా మైనార్టీల సంక్షేమం కోసం పట్టించుకోలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేసిందన్నారు. షాది ముబారక్‌తో పాటు అన్ని సంక్షేమ పథకాల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్లో ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. గురుకుల పాఠశాల, ఇతర కార్యక్రమాల్లో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ స్పెషల్ అధికారి ముత్యం రెడ్డి, జెడ్పీటీసి మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ జకీర్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

4



సిద్దిపేట

గురువారం 20 ఏప్రిల్ 2023

క్రీడాకారులకు క్రీడా సామాగ్రి అందజేత



డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య

నవతెలంగాణ-మిరుదొడ్డి

యువత విద్యతో పాటు క్రీడలలో రాణించాలని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్య అన్నారు. బుధవారం దుబ్బాక నియోజకవర్గంలోని అక్బరుపేట-భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామానికి చెందిన మహారాజ్ యూత్ సభ్యులకు డీసీసీబీ జిల్లా డైరెక్టర్ బక్కి వెంకటయ్య తన సొంత ఖర్చుతో వాలీబాల్, క్యారమ్ బోర్డులను అందజేశారు. అనంతరం మహారాజ్ యూత్ సభ్యులు దాత బక్కి వెంకటయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుబ్బరాజం, ఉప సర్పంచ్ వడ్ల ప్రభాకర్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్, వార్డు సభ్యులు దోమకొండ నర్సింలు, నందాల కిషన్,తదితరులున్నారు.

అన్ని కులాల అభివృద్ధి కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-సిద్దిపేట రూరల్



అన్ని కులాలు అభివృద్ధి కేసీఆర్ ప్రభుత్వం లక్ష్యం అని సర్పంచ్ నిరటి కవిత రవీందర్ అన్నారు. బుధవారం సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురుకుల గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లింల సోదరులు కు కేసీఆర్ కిట్స్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్ని కులాలకు సమ ప్రాధాన్యమిస్తూ కులాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేరిపల్లి యాదగిరి, సర్పంచ్ నీరటి కవిత రవీందర్, ఉప సర్పంచ్ మారెడ్డి శ్రీకాంత్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శిల్ప పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా తెలంగాణ ప్రభుత్వం

ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి

నవ తెలంగాణ-మిరు దొడ్డి



పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించారని ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, కోఆప్షన్ సభ్యులు హైమద్ అన్నారు. బుధవారం మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామానికి చెందిన పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. అల్వాల గ్రామానికి చెందిన మామిడాల కళావతికి రెండు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రూ.28000, రూ.10500, మహమ్మద్ మౌలానాకు రూ.14500 చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దిలీప్, గ్రామ శాఖ అధ్యక్షులు ప్రసాద్, నాయకులు రాజయ్య మధు బాబు, నితిన్, శ్రీనివాస్, జావీద్ తదితరులున్నారు

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

పాములపర్తి సర్పంచ్ తిర్మల్ రెడ్డి

నవతెలంగాణ-మర్కుక్



కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని పాములపర్తి సర్పంచ్ తిర్మల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామ పంచాయతీ కార్యక్రమంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 18 సంవత్సరాలు పైబడిన వారు తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకం గ్రామ ప్రజలందరూ నిషేధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పద్మ నర్సింలు, డా.ఆశాజ్యోతి, డీఈవో గణేష్, పంచాయతీ కార్యదర్శి స్వప్న, వార్డు సభ్యులు, అంగన్ వాడి టీచర్లు, ఆశావర్కర్లు, తదితరులున్నారు.

వికలాంగురాలికి ఎలక్ట్రికల్ సైకిల్ మంజూరు చేసిన మంత్రి

నవతెలంగాణ- జగదేవపూర్



జగదేవపూర్ మండలం పరిధిలోని రాయవరం గ్రామానికి చెందిన దెబ్బేట లక్ష్మి నిరుపేద వికలాంగురాలు . ఆమె నడవలేని పరిస్థితిలో ఉన్న విషయాన్ని సర్పంచ్ పావని కనకరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్‌కు తెలియజేశారు. స్థానిక సర్పంచ్‌తో కలిసి ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు దృష్టికి వికలాంగురాలి పరిస్థితిని తీసుకువెళ్లగా స్పందించిన మంత్రి వికలాంగురాలైన లక్ష్మికి ఎలక్ట్రికల్ సైకిల్ మంజూరి చేశారు. మంజూరైన సైకిల్‌ను బుధవారం లక్ష్మికి ప్రభుత్వం తరుపున రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవి రవీందర్ అందించారు. ఈ సందర్భంగా లక్ష్మీ, ఆమె తల్లిదండ్రులు చంద్రయ్య లచ్చవ్వలు మాట్లాడుతూ తన కష్టాన్ని చూసి స్పందించిన మంత్రికి, అందుకు సహకారాన్ని అందించిన మాదాసు శ్రీనివాస్, దేవి దేవి రవీందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకరాజు, నవీన్, రాజు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

స్పృహ తప్పి వ్యక్తి మృతి

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్



స్పృహ కోల్పోయి వ్యక్తి మృతి చెందిన సంఘటన సిద్దిపేట అర్బన్ మండలం కిష్ట సాగర్ రోడ్డులో బుధవారం జరిగింది. సిద్దిపేట త్రీ టౌన్ సిఐ భాను ప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం తొగుట మండలం కాన్గల్ గ్రామానికి చెందిన మరుపల్లి శ్రీనివాస్ గౌడ్ (43) గౌడ్ గత సోమవారం గాయంతో ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స చేయించుకుని బుధవారం ఉదయం పొన్నాలలోని బంధువుల ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో స్పృహ తప్పి కింద పడి మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. మృతునికి భార్య సుమలత, ఇద్దరు కూతుళ్లు మనీ(21) ప్రియా (18)లు ఉన్నారు.

కార్యకర్తలను పట్టించుకోవడం లేదు

నాచారం డైరెక్టర్ నరేష్ గౌడ్

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను పట్టించుకోవటం లేదని వర్గల్ మండలం నాచారం డైరెక్టర్ మామిడి నరేష్ గౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలో ఉన్న కార్యకర్తలకు సమాచారం లేకుండా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పార్టీ సీనియర్ కార్యకర్తలను పదవులు పొందిన నాయకులు పట్టించుకోవటం లేదని ఆయన ఆవేదన చెందారు. ఈ విషయంలో మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలన్నారు. 2001 నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న కార్యకర్తలను ఎందుకు పట్టించుకోవడంలేదన్నారు. పార్టీ పటిష్టత కోసం ఎంతో కష్టపడుతున్నామన్నారు. పార్టీ సమావేశాలు పెడితే సమాచారమివ్వడం లేదన్నారు.

వంట వార్పు జయప్రదం కోసం కరపత్రాల పంపిణీ

జేఏసీ అఖిలపక్షం ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీలో పెంచిన ఇంటి పన్నులు తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలోని అంగడి బజారు అంబేద్కర్ చౌరస్తా వద్ద నిర్వహించే వంటావార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డాక్టర్ రామగళ్ల పరమేశ్వర్ పట్టణ ప్రజలను కోరారు. ఈ మేరకు జేఏసీ, అఖిలపక్షం ఆధ్వర్యంలో బుధవారం పట్టణ శివారులోని సుందరయ్య నగర్, బురాన్ మియా తోట, వెలుగల వారి కాలనీ, బండపల్లి, కొట్టె వారి కాలనీలలో ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు, వర్తక, వాణిజ్య సంస్థలు, కార్మికులు, కర్షకులు, మహిళలు, రిటైర్డ్ ఉద్యోగ ఉపాధ్యాయులు, సీనియర్ సిటిజెన్స్ అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, సీపీఐ(ఎం), సిపిఐ, ఏఐఎఫ్‌బీ, బీఎస్పీ, టీడీపీ, చాబర్ ఆఫ్ కామర్స్, ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, ఇంటి పన్ను బాధితుల సంఘం నాయకులు, జేఏసీ కో చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, మాజీ జడ్పీటీసీలు దాసరి కళావతి, కొమ్ము నర్సింగరావు, అవుశెర్ల యాదయ్య, బుట్టి సత్యనారాయణ, పుట్ట రాజు,రాములు, మహేష్, కనకయ్య, కనకవ్వ, రజిత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి ఆదర్శంగా మన ఊరు మనబడి పనులు ఉండాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

నవ తెలంగాణ-కొండపాక

మన ఊరు మన బడి కార్యక్రమంలో చేపడుతున్న పనులు రాష్ట్రానికి ఆదర్శంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రశాంతి జీవన్ పాటిల్ అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో గజ్వేల్ నియోజకవర్గంలో మన ఊరు మన బడి పథకం కింద కేటాయించిన పాఠశాలల వారిగా ఎచ్ఎం, ఎంఈవో, ఎంపిడిఒ, ఎపిఒ, ఇంజినీరింగ్ విభాగం ఏఈ, డిఈలు, సర్పంచ్, కౌన్సిలర్లు, నిర్మాణ ఏజెన్సీలతో పాలనాధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాలనాధికారి ప్రశాంతి జీవన్ పాటిల్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గాన్ని మన ఊరు మన బడి పథకంలో చేపడుతున్న పాఠశాలల అభివృద్ధి పనులను రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచేలా పని చేయాలని అధికారులకు సూచించారు. ఈ పథకం చేపడుతున్న పనులు మే నెల 15వరకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేసి పాఠశాల పునఃప్రారంభం వరకు కొత్త పాఠశాలల్లో పిల్లలు ఉండాలన్నారు. ఈ పథకంలో ఎలక్ట్రిసిటీ, తాగునీటి వసతి, మేజర్ మైనర్ (కిటికీలు, డోర్లు, స్లాప్, ఫ్లోర్) రిపేర్లు తప్పని సరిగా వేగంగా పూర్తి చేసి కలరింగ్‌కు నమోదు చేసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్, ఈజీఎస్ కింద చేసే పనుల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్ పూర్తి చేశాకే మిగతా ప్రహరీ గోడ, అదనపు తరగతి గదులు, భోజన శాల పనులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో టెండర్ పనులు, ప్రారంభం నుంచి పూర్తి అయ్యేవరకు రోజువారిగా సమన్వయంతో పర్యవేక్షణ చేస్తు కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలని డీఈ, ఎఈలకు తెలిపారు. కొండపాక మండలంలోని పథక పనులు నత్తనడకన సాగుతున్నందున అదికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో సివిల్ పనుల్లో కొందరు కాంట్రాక్టర్‌లు అలసత్వం ప్రదర్శిస్తున్నందున అందరినీ సమన్వయ పరిచి 2రోజుల్లో తనతో సమావేశ పరచాలని ఈడబ్లుఐడిసి ఈఈ కి తెలిపారు. పాఠశాలల్లో సేవింగ్స్ ఉంటే సుందరీకరణ చేయాలన్నారు. అందులో స్టీల్ అక్షరాలతో పాఠశాల బోర్డు తప్పనిసరి, పెద్ద గేట్ పైన ఆర్చ్, మెట్లకు గ్రానైట్, స్టేజ్ పక్కన గ్రానైట్, గడ్డి కార్పెట్, ఇతర పనులను చెయ్యాలి. సుందరీకరణ బాధ్యతలు ఆయా మండల ఎంఈఓ లు తీసుకోవాలి. ఎప్పటి పనులకు అప్పుడు ఎప్టిఓ జనరేట్ చేసి కలరింగ్ ఏజెన్సీకి మెథర్ మెంట్ షిట్‌ను అందించాలని ఎఈలకు తెలిపారు. అలాగే



ఈజీఎస్ పనుల ఎప్టిఓ లను జనరేట్ చేయడానికి ఎంపీడీఓ, ఎంపీఓలు ఎఈలకు తోడ్పాటు అందించాలన్నారు. ఈజీఎస్ పనుల్లో వేగం పెంచడానికి చర్యలు తీసుకోవాలని డీఆర్డీఏ పీడీకి సూచించారు. రోజువారిగా పర్యవేక్షణ చేయాలని ఎంపీడీఓ, ఎంపిఓ, ఎపిఓలకు తెలిపారు. మళ్లీ సమావేశంలోపు పనుల్లో వేగం పెంచి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్ రెడ్డి, ఈడబ్లుఐడిసి ఈఈ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సమయపాలన తప్పిన జగదేవపూర్ పోస్ట్ ఆఫీస్

అడిగేవారు లేరని అధికారి ఇష్టానుసారం

నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ కార్యాలయం సమయ పాలన పాటించడం లేదని పలువురు ప్రజలు, ఖాతాదారులు వాపోతున్నారు. బుధవారం ప్రజలు తెలిపిన వివరాల ప్రకారం ప్రతి రోజు పోస్ట్ ఆఫీస్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సమయానికి కార్యాలయానికి రావడం లేదన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉదయం 9:40 గంటలకు కార్యాలయం ప్రారంభం కావాల్సి ఉండగా 10.30 గంటలు దాటినా తెరుచుకోవడం లేదని తెలిపారు. పోస్ట్ ఆఫీస్ సిబ్బందిపై ప్రజలు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. పోస్ట్ ఆఫీస్ పనికోసం వచ్చిన వారు సిబ్బంది కోసం ఎదురుచూస్తున్నారు. అసలే ఎండాకాలం కావడంతో వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. సీఎం కేసీఆర్ సొంత



నియోజకవర్గంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్రం మొత్తంలో పరిస్థితి ఏంటని పలువురు వాపోతున్నారు. పోస్ట్ ఆఫిస్ పని ఉంటే వ్యవసాయ పనులు మానుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని , ఇప్పటికైనా పై స్థాయి అధికారులు స్పందించి సిబ్బంది సరైన సమయానికి వచ్చి కార్యాలయం తెరుచుకునే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గురుకుల విద్యాసంస్థల వేసవి శిబిరం వాల్ పోస్టర్ ఆవిష్కరణ

నవ తెలంగాణ-కొండపాక

గురుకుల విద్యా సంస్థలలో స్పార్క్ లెస్ ప్రోగ్రాం ద్వారా నిర్వహించే సమ్మర్ క్యాంప్స్ కార్యక్రమం వాల్‌పోసర్టర్లను బుధవారం కలెక్టర్ కార్యాలయంలో గురుకుల విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మే 6వ తేదీ వరకు స్పార్క్ లెస్ పేరుతో సమ్మర్ క్యాంప్స్ నిర్వహించారు. విద్యార్థులకు ఎంపిక చేసిన రంగాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆయా రంగాల్లో స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ స్కిల్స్ భవిష్యత్తులో ఎంచుకున్న రంగాల్లో విజయవంతంగా రాణించేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. హుస్నాబాద్ సోషల్ వెల్ఫేర్



రెసిడెన్షియల్ (బాయ్స్) కాలేజీలో బాలురకు చిత్రలేఖనం, యాంకరింగ్, ఉపన్యాసం, యువ జర్నలిస్ట్, వెస్టర్న్ డాన్స్ రంగాలలో, తొగుట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ కాలేజీలో బాలికలకు లైఫ్ స్కిల్స్, వెస్టర్న్ డాన్స్, బ్యూటీ కేర్, బేసిక్ అబాకస్ అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆర్సిఓ కె.నిర్మల, హుస్నాబాద్ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, తోట గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ మెర్సీ వరూధిని, ఇతర గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

బడి చివరి రోజున విద్యార్థులకు ప్రగతి పత్రాలు

మండల విద్యాధికారి దేశిరెడ్డి

నవతెలంగాణ-నంగునూరు

పాఠశాలలకు చివరి దినం అయిన ఈ నెల 24వ తేదిన విద్యార్థులకు ఫలితాలను ప్రగతి పత్రంలో వేసి వారికి అందచేయాలని మండల విద్యాధికారి దేశిరెడ్డి సూచించారు. బుధవారం నర్మెట్ట కేజీబీవీలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశీరెడ్డి పాఠశాలల్లో ఉన్న పరిస్థితులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశానుసారం పాఠశాలల పునఃప్రారంభం రోజు వరకు మన ఊరు-మన బడి పథకం ద్వారా జరుగుతున్న పనులను, ప్రజాప్రతినిధుల సహకారంతో పూర్తి చేసే విధంగా కృషి చేయాలన్నారు. మౌళిక వసతుల కల్పన కోసం కృషి చేయాలన్నారు. అదే



విధంగా వేసవి సెలవుల్లో పాఠశాలను పరిశుభ్రంగా వుండే విధంగా చూసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నర్మెట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఎస్. యాదగిరి, ప్రధానోపాధ్యాయులు నాగేందర్ రెడ్డి, అక్కెనపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవీందర్ గౌడ్, కేజీబివి ప్రత్యేక అధికారి పద్మ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సిఆర్పీలు పెంటయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటేనే ప్రారంభించాలి

నవతెలంగాణ-కొండపాక



జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ జిల్లా రైతు కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా పాలనాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతు కిసాన్ సంఘ్ నాయకులు మాట్లాడుతూ యాసంగి సీజన్లో రైతులు పండించిన ధాన్యాన్ని మార్కెటింగ్ చేయటంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించకుండా సంబంధిత అధికారులు సహకరించాలని కోరారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా హామాలీ రేట్లు సమానంగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని కొనుగోలు సెంటర్లో రైతులకు సరిపడు తార్పాల్సింగ్‌ను అందుబాటులో ఉంచాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జస్వంత్ రెడ్డి ఉపాధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, జిల్లా మార్కెటింగ్ ప్రముఖ్ తిరుపతిరెడ్డి, జిల్లా నాయకులు శ్రీనివాసరావు, గుర్రం మల్లారెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు..

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి

నవ తెలంగాణ-రాయపోల్

బిడ్డ పుట్టిన గంటలోపే తల్లి పట్టే ముర్రుపాలు శిశువుకు ఎంతో పౌష్టిక ఆహారం. డబ్బా పాలు వద్దు తల్లి పాలు ముద్దు అని అన్నాజీపూర్ సర్పంచ్ ఎనుముల శోభారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్ డెబోరా రాణి అన్నారు. బుధవారం రాయపోల్ మండలంలోని అనాజీపూర్ అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ మహిళలందరికీ సామూహిక సీమంతాలు, అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి నేటి సమాజంలో పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడంలో మొహమాట పడుతున్నారని, అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారం ప్రారంభించినప్పటికీ తల్లిపాలు బిడ్డకు పడుతూనే ఉండాలని తెలిపారు. బిడ్డకు పుట్టిన వెంటనే పట్టిన తల్లి పాలు మొదటి టీకాలుగా పని చేస్తాయన్నారు. శిశు మరణాలు తగ్గించాలంటే తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు. తల్లిపాలు తాగే పిల్లలలో వికాసం, అభివృద్ధి పోత పాలు తాగే పిల్లల కంటే అధికంగా ఉంటుందన్నారు. పోత పాల వలన పిల్లలు వ్యాధుల బారిన పడే అవకాశాలు అధికంగా ఉంటాయన్నారు. తల్లిపాలు బిడ్డ దీర్ఘకాలిక అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. గర్భిణీ మహిళలకు అంగన్వాడీ కేంద్రాలలో ఆరోగ్యవంతమైన



పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. అలాగే గర్భిణీ మహిళలు ప్రతిరోజు పాలు, గుడ్డు, పప్పు, ఆకుకూరలు, మాంసం వంటి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మానసికంగా ఎంతో దృఢంగా ఉండాలని అనవసరమైన ఆలోచనలు పెట్టుకుంటూ మానసికంగా బాధ పడొద్దు అన్నారు. శరీరానికి అలసట కలిగించే కష్టతరమైన పనులను చేయవద్దని ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, అంగన్వాడి టీచర్లు పద్మ, మంజుల, సరస్వతి,రాధ, ఉపాధ్యాయులు, ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శంగా సీఎం కేసీఆర్ పాలన

బీఆర్ఎస్‌కు అండగా నిలుస్తున్న సబ్బండ వర్గాలు

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి

నవతెలంగాణ-తొగుట



తెలంగాణను సాధించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి,బసొసైటీ చైర్మన్ కె హరికృష్ణా రెడ్డి, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్యలు అన్నారు. బుధవారం మండలంలోని గుడికందుల, గోవర్ధనగిరి, వర్ద రాజ్ పల్లి గ్రామాలలో బీఆర్ఎస్ పార్టీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన కళ్ళ ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. పార్టీకి కార్యకర్తలు కీలకమని వారు క్రియాశీలకంగా పనిచేయాలని అన్నారు. తెలంగాణ రాకముందు వచ్చిన తర్వాత ఏర్ప డిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలన్నారు. 65 ఏళ్ల కాంగ్రెస్, టీడీపీ పాలనలో తెలంగాణకు ఒరిగిందేమీ లేదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి మోడల్‌గా తీర్చిదిద్దిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో విజయ డంకా మోగించడం ఖాయమన్నారు. గుడికందులలో బూత్ కమిటీ అధ్యక్షులుగా హెచ్ గురువారెడ్డి, బంగారుగల్ల ఈశ్వర్, మంగలి నర్సింలు, ఉప్పరి కమలాకర్, సోష ల్ మీడియా ప్రతినిధిగా దావలగల్ల కిష్టయ్యలను, గోవర్ధనగిరిలో బూత్ కమిటీ అధ్యక్షులుగా గడ్డం రాఘవులు, సోషల్ మీడియా ప్రతినిధిగా అయ్య వారి పరమేష్, వర్ధరాజ్ పల్లిలో బూత్ కమిటీ అధ్యక్షుడిగా ఎర్ర జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా పోతుగంటి రాజిరెడ్డి, ప్రతినిదులుగా కోతి సంతోష్, ఎర్వ కమలాకర్ రెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు సిరినేని గోవర్ధన్ రెడ్డి, సర్పంచ్ తోయేటి ఎల్లం, రైతు బంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్య, ఎంపీటీసీ కొమ్ము శరత్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది రాంరెడ్డి,మండల పార్టీ మాజీ అధ్యక్షులు చిలువేరి మల్లారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు పులి రాజు, నంట పరమేశ్వర్ రెడ్డి, బైరయ్య, ఆత్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బైరాగౌడ్, బాల్ రెడ్డి, దుబ్బాక కనకయ్య, నాయకులు సుతారి రమేష్, మంగ నర్సింలు, స్వామి రెడ్డి, చెత్రి శ్రీనివాస్, కనకయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

పాములపర్తిలో చలివేంద్రం ప్రారంభం

సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి



నవతెలంగాణ-మర్కుక్

ఎండాకాలంలో ప్రయాణికుల దాహం తీర్చడానికి పాములపర్తి గ్రామంలో సిద్దిపేట యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం సంతోషాదాయకమని సర్పంచ్ పాములపర్తి తిర్మల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మర్కుక్ కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు తాండ కనకయ్య గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బబ్బూరి మల్లేశం గౌడ్, ఉపసర్పంచ్ పద్మ నర్సింలు, మేహుల్ రెడ్డి, రాహుల్ రెడ్డి , నాయకులు క్రాంతి కుమార్, గుర్రాల నర్సింలు, చెక్కల మల్లేశం, నర్సింలు, బోయిన్ లక్ష్మణ్, మంగి కిషన్, నాగరాజు, మల్లేశం, మహేష్, అశోక్ తదితరులున్నారు.

కేజీబీవీలో అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-ములుగు

ములుగు మండలం కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-2024 సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమైనాయని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అరుణ తెలిపారు. ఆమె మాట్లాడుతూ 6వ తరగతిలో 40 సీట్లు, 7వ తరగతిలో 5 సీట్లు, 8వ తరగతిలో 5 సీట్లు, 9వ తరగతిలో 10 సీట్లు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. కొత్తగా ప్రవేశాలకు దరఖాస్తులు పొందగోరు అభ్యర్థులు వారి ఆధార్ కార్డు జిరాక్స్, రెండు ఫొటోలతో ఈ నెల 24వ తేదీ లోపు పాఠశాలలో ఇవ్వాలని, వివరాలకు ఫోన్ నెంబర్ 9652108006లకు సంప్రదించాలని తెలిపారు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం అక్కన్న పేట మండలానికి చెందిన ఉప్పుగళ్ళ నరసింహులుకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.60 వేల చెక్కును అక్కన్నపేట మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎంపిటిసి పెసరు సాంబరాజు, బిఆర్ఎస్ యూత్ నాయకుడు పెద్దపల్లి అరుణ్ కుమార్ లబ్దిదారునికి అందజేశారు. అక్కన్న పేట మండలంలో వందలాది మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా లబ్ది చేకూరిందని మండల అధ్యక్షుడు సాంబరాజు తెలిపారు.

మే 1,2 తేదీలలో జిల్లా పరిషత్ స్థాయి సంఘసమావేశం

నవతెలంగాణ-మెదక్ రూరల్

జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు మే 1,2 తేదీలలో సంఘం అధ్యక్షుల ఆధ్వర్యంలో జిల్లా ప్రజా పరిషత్‌లో నిర్వహించనున్నామని జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి వెంకట శైలేష్ తెలిపారు. మే 1 న ఉదయం 11 గంటలకు వ్యవసాయంపై 3వ స్థాయి సంఘం, మధ్యాహ్నం 2 గంటలకు స్త్రీ శిశు సంక్షేమంపై 5వ స్థాయి, మధ్యాహ్నం 3 గంటలకు సాంఘీక సంక్షేమంపై 6వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నామని తెలిపారు. మే 2న మధాహ్నం 12 గంటలకు విద్య, ఆరోగ్యంపై 4వ స్థాయి సంఘ సమావేశం, 2. 30 గంటలకు ఆర్థిక, ప్రణాళికపై ఒకటవ స్థాయి, 3. 30 గంటలకు పనులపై 7వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు. సమావేశాలలో ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానాలు తెలిపే విధంగా సమగ్ర సమాచారంతో అధికారులు సమావేశాలకు హాజరు కావాలని సూచించారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి

హుస్నాబాద్ ఎంపీపీ మానస



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని హుస్నాబాద్ ఎంపీపీ లకావత్ మానస అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మానస మాట్లాడుతూ ప్రభుత్వం రంజాన్ మాసం పేద ముస్లింలకు మహిళలకు చీరలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, కో ఆప్షన్ సభ్యులు సలీం వివిధ గ్రామాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు

మాల మహానాడు మండల అధ్యక్షులుగా అమ్ముల నర్సింలు

నవతెలంగాణ-కొండపాక



మాలమహానాడు కొండ పాక మండల అధ్యక్షులుగా అమ్ముల నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల పరిధి లోని దుద్దెడ ఎల్లమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎల్లేష్ ఆధ్వర్యంలో నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి ఎల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

నవతెలంగాణ-జగదేవపూర్



జగదేవపూర్ మండల కేంద్రంలో గల కాళేశ్వరం కాలువ సమీపంలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైనట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. స్థానికులు మృతదేహాన్ని గమనించి సమాచారాన్ని ఎస్ ఐ కృష్ణమూర్తికి అందించడంతో వెంటనే సిబ్బందితో అక్కడికి చేరుకుని కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌తో సంప్రదించాలని ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలు



నవతెలంగాణ-వర్గల్

రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు రంజాన్ కానుకలను జెడ్పీటీసీ బాలమల్లు యాదవ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా కానుకలను అందజేస్తోందని, అలాగే ముస్లిం ఆడ పిల్లలు షాదీముభారక్ వంటి పథకాల ద్వార లబ్ధి పొందుతున్నారన్నారు. మైనారిటీలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ సతీష్ కుమార్, కో ఆప్షన్ సభ్యులు ఫరూక్ అలీ, బీఆర్ఎస్ నాయకులు జెల్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నంగునూరులో బస్ పాస్ మేళా

నవతెలంగాణ-నంగునూరు

నేడు నంగునూరు మండల కేంద్రంలో వికలాంగుల బస్సు పాస్ మేళా నిర్వహించనున్నట్లు సిద్దిపేట డిపో మేనేజర్ వై.సుఖేందర్ రెడ్డి తెలిపారు. అదే విధంగా నంగునూరు మండల కేంద్రంలో ప్రజల వద్దకే ఆర్టీసీ సేవలు కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ సలహాలు, సూచనలు తెలియజేయాలని సూచించారు. మండలంలోని వివిధ గ్రామ వికలాంగుల రాయితీ ఉచిత బస్ పాసులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వికలాంగులు సదరం సర్టిఫికేట్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, ఒక పాస్ ఫొటో, సర్వీస్ ఛార్జ్ రూ.50 లు తీసుకొని నంగునూరు మండల కేంద్రానికి రావాలని కోరారు. ఈ సదవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జోగుపేటలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని సెల్ టవర్ ఎక్కిన యువకుడు



నవతెలంగాణ జోగిపేట

ఇటీవల జోగిపేట మున్సిపాలిటీలో పంపిణీ చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో తనకు కేటాయించలేదని జోగిపేట పట్టణంలోని 2 వార్డు పరిధిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన కమ్మరి రాజశేఖర్ (26) బుధవారం రాత్రి పట్టణంలోని మార్కెట్ యార్డ్ ముందుగా సెల్ టవర్ కి తన ఆవేదనలు వెలగక్కాడు. తనకు న్యాయం చేయాలని లేనిచో తాను కిందికి దూకేస్తానని పైనుంచి అంటున్నాడు. విషయం తెలుసుకున్న జోగిపేట ఎస్సై 2 పెంటయ్య తన సిబ్బందితో సెల్ టవర్ వద్దకు వచ్చి యువకుడిని కిందికి దిగాలని సర్ది చెప్పే ప్రయత్నం చేస్తున్నారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం



నవ తెలంగాణ కొండపాక

సిద్ధిపేట జిల్లా కుకునూర్ పల్లి మండలం కేంద్రం లో పిచ్చికుక్కల స్వైర విహారం చేసాయి. పిచ్చికుక్కల దాడిలో మండల కేంద్రానికి చెందిన దాదపు 10 మంది కి తీవ్ర గాయాలయ్యాయి. కుకునూర్ పల్లి మండల కేంద్రానికి చెందిన లక్మణ్ రావు పంతులు , మంద సత్తయ్య,గంగిశెట్టి శండవ్వ , సుజాత , శ్రీకృతి తో పాటు మరో 5 మంది పిచ్చికుక్క దాడిలో గాయాలు కావడంతో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రి కి తరలించారు . ఇంటి బయట ఉన్న వారిపై కుక్క దాడి చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టి పిచ్చికుక్కలను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేదంటే మరికొంతమందిని పై దాడి చేసి గాయపరిచే ప్రమాదం ఉంటుందన్నారు.

విద్యార్థులు లేరని వసతి గృహాల మూసివేత తగదు

నవ తెలంగాణ - సిద్దిపేట

విద్యార్థులు లేరనే పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా 100 వసతి గృహాలు మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డమైన అరవింద్ ,దాసరి ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ ఈ నిర్ణయం వల్లన గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరం అవుతారని, హస్టల్స్ మూసి దగ్గర ఉన్న గురుకులాలలో, హస్టల్స్ లో విలీనం చేస్తామని చెప్పడం అంటే సంక్షేమ వసతిగృహాలకు నష్టం చేయడమేనని అన్నారు. విద్యార్థులు చేరేలా ప్రభుత్వం పోత్సహించకుండా,విద్యార్థులు20 మంది కంటే తక్కువ ఉన్నారని మూసివేయడం తగ్గదని, దళిత,గిరిజన, ఆదివాసీ విద్యార్థులలో చదువుకు హస్టల్స్ సదుపాయాలు కల్పిస్తేనే చదువుకుంటారని, వలసలు వెళ్ళి వారి పిల్లలు, ఇతర పనులు చేసే తల్లిదండ్రులు తమ పిల్లలను ఎక్కడైనా తమ ఊర్లో ఉంచి చదివించే అవకాశం ఉండదని అన్నారు.

మూసివేత పేరుతో సంక్షేమానికి నిధులు తగ్గించి, పేద విద్యార్థులకు చదువును దూరం చేసి కుట్ర ఉందని తెలిపారు. వార్డెన్లు, నోట్ పుస్తకాలు, సరైన మెనూ, అదనపు గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం కల్పించకుండా విద్యార్థులు లేరనే పేరుతో మూసివేస్తే ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తమ నిర్ణయాన్ని విరమించుకోవాలని కోరారు.

ప్రమాదాలప్పుడు మానవత్వంతో స్పందించాలి

నవతెలంగాణ హుస్నాబాద్ రూరల్

రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మానవత్వంతో స్పందించి బాధితులకు సహాయం చేసి ప్రాణాలను కాపాడలని రోడ్ సేఫ్టీ అథారిటీ డిఎస్పీ చంద్రభాను అన్నారు. బుధవారం హుస్నాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందికి, ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రోడ్ సేఫ్టీ అథారిటీ డిఎస్పీ చంద్రభాను హాజరై తగు సూచనలు చేశారు. ఇటీవల అకస్మాత్తుగా కార్డియాక్ అరెస్టుకు లోనై వ్యక్తులు ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ప్రజలకు ఏళ్ల వేళల అందుబాటులో ఉండే ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది సిపిఆర్ పై అవగాహన ఉండాలన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

నవతెలంగాణ దౌల్తాబాద్



అక్రమ కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని కాపాడాలని ఉప్పరపల్లి సర్పంచ్ కళాలి చిత్తారి గౌడ్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ తహసిల్దార్ దండు సునీత గారికి ఉప్పరపల్లి గ్రామంలో కబ్జాకు గురైతున్న ప్రభుత్వ భూములను రక్షించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలం ఉప్పరపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర దేవాలయానికి సంబంధించిన దేవాదాయ భూములు మొత్తం 9 ఎకరాల-07 గుంటల భూమి ఉంది. కాగా ఈ భూమిని కొంతమంది అక్రమార్కులు కబ్జా చేయడం జరిగింది .సర్వే నెంబర్ 302 లో 1 ఎకరం-35 గుంటలు అయ్యవారు రత్నయ్య, సర్వేనెంబర్ 303 లో 1 ఎకరం 11 గుంటలు నిరుడు వారు,సర్వే నెంబర్ 304 లో 1ఎకరం 14 గుంటలు అయ్యవారు రత్నయ్య, ఇతరులు,305 2 ఎకరాల 16 గుంటలు అయ్యావారు రత్నయ్య ,సర్వే నెంబర్ 306 లో 1 ఎకరం 05 గుంటలు, సర్వే నెంబర్ 307 లో 2ఎకరాల 10 గుంటల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వెంటనే వెంకటేశ్వర దేవాలయానికి సంబంధించిన భూములు అన్నింటిని సర్వే చేసి రక్షించవలసిందిగా రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందన్నారు. ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కోసం వాటిని కాపాడే వారికి దేవాదాయ భూములను కేటాయిస్తే కొందరు అక్రమార్కులు వాటిని కబ్జా చేసుకొని వ్యవసాయానికి ఇతర సొంత లాభాలకు వినియోగిస్తున్నారని అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ రామ గౌని నాగరాజ్ గౌడ్, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటేండ్ల ఖాళీ జాగాల్లో గుడిసెలేసుకుని బతుకుతున్నం

-కవ్వంపల్లికి గోడేల్లబోసుకున్న బేగంపేట నీరుపేదలు
-తొమ్మిదేండ్లుగా ఇండ్ల కోసం ఎదురుచూస్తున్నామని అవేదన

నవతెలంగాణ-బెజ్జంకి



ప్రభుత్వం డబుల్ ఇండ్ల నిర్మాణం చేపడుతుందుమోనని తొమ్మిదేండ్లుగా ఎదురుచూపులు చూస్తూ విధిలేని పరిస్థితుల్లో పటేండ్ల ఖాళీ జాగాల్లో గుడిసెలేసుకుని బ్రతుకుతున్నామని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాధ్యక్షుడు, మానకొండూర్ నియోజకవర్గ ఇంచార్జీ కవ్వంపల్లి సత్యానారాయణ వద్ద బేగంపేట గ్రామంలోని నీరుపేదలు అవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల పరిదిలోని బేగంపేట గ్రామంలో డబుల్ ఇండ్ల నిర్మాణం కోసం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేసిన శిలపలకాన్ని కవ్వంపల్లి సత్యనారాయణ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరిశీలించారు. తొమ్మిదేండ్లలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ నియోజకవర్గ ప్రజలకు చేసిందేమిలేదని.. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బేగంపేట గ్రామంలోని స్థలాలున్న ప్రతి నీరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇస్తామని కవ్వంపల్లి భరోసానిచ్చారు. అనంతరం బేగంపేట,లక్ష్మీపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కీస రత్నాకర్ రెడ్డి,మాంకాళి ప్రవీణ్,శీలం నర్సయ్య,దోనె వెంకటేశ్వర్ రావు,గుండా అమరేందర్ రెడ్డి,అరుణ్ కుమార్, రాజు మహేందర్,తూమోజు వెంకట చారీ,బుర్ర తిరుపతి గౌడ్,గంప రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారిద్దాం



నవ తెలంగాణ - దౌల్తాబాద్

ప్రస్తుత ఆధునిక కాలంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోయిందని దానివల్ల పర్యావరణానికి ప్రమాదం వాటిల్లుతుందని గాజులపల్లి సర్పంచ్ అప్పవారు శ్రీనివాస్ అన్నారు. బుధవారం దౌల్తాబాద్ మండలం గాజుల పల్లి గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటివెలుగు కార్యక్రమంలో పాల్గొనే వైద్య సిబ్బంది, అధికారులకు స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉద్దేశ్యంతో స్టీల్ బ్యాక్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం కంటి సమస్యలను లేని రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రజలందరికీ ఉచితంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించి అద్దాలు,మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దృష్టి లోపాన్ని నివారించుకోవాలన్నారు. గ్రామంలోని ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ వాడటం వలన క్యాన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దొమ్మాట తాజా మాజీ సర్పంచ్ గన్నమనేని మోహన్ రావు, ఉప సర్పంచ్ బాసంగారి నర్సవ్వ నరేందర్ రెడ్డి ,వార్డు సభ్యులు బోయిని ప్రవీన్, పంచాయతీ కార్యదర్శి హంసకేతన్ అంగన్వాడీ కార్యకర్త పోతుగంటి సరోజన , కొన్యాల కరునాకర్ రెడ్డి పూసపల్లి కుమార్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీక్లబ్స్ సేవలు అభినందనీయం



నవ తెలంగాణ - సిద్దిపేట

సిద్దిపేట వాసవి క్లబ్స్ సేవలు అభినందనీయమని వాసవి క్లబ్ రీజియన్ చైర్మన్ పుల్లూరు శివకుమార్ అన్నారు. బుదవారం స్నేహపూర్వక సందర్శనలో భాగంగా పుల్లూరు శివ కుమార్ మాట్లాడుతూ వాసవి క్లబ్స్ నూతన కార్యవర్గం ఏర్పడి 110 రోజులు అయినదని, ఇప్పటికి 150 సేవా కార్యక్రమాలు చేసినందుకు మూడు క్లబ్ ల కార్యవర్గాన్ని అభినందించారు. సిద్దిపేటలో నివసించే స్రవంతికి కుట్టు మిషను అందించడం జరిగినది. అన్నపూర్ణేశ్వరి గుడి చౌరస్తా వద్ద చలివేంద్రం ప్రారంభించడం జరిగినది. పాత వెంకటేశ్వర దేవాలయం వద్ద చలివేంద్రం ప్రారంభించడం జరిగినది. బెజుగాం రూప-రమేశ్ వివాహ వార్షికోత్సవ సందర్భంగా పట్టణ నిరాశ్రయుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ గంప కృష్ణమూర్తి, ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ యాద శ్రీనివాస్, రీజియన్ చైర్మన్ పుల్లూరు శివకుమార్, డిస్టిక్ ఇంచార్జ్ నేతి వేణు కుమార్, డిస్టిక్ ఇన్చార్జి మాంకాల నవీన్ కుమార్, క్యాబినెట్ జాయింట్ ట్రెజరర్ పుల్లూరు శశాంక్, డిస్టిక్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పుల్లూరు శ్రీనివాస్, జోన్ చైర్మన్ సోమ వనజ, రీజియన్ సెక్రెటరీ మాంకాల శ్రీనివాస్, వాసవి క్లబ్ మాజీ అధ్యక్షుడు జైన సత్యం , వాసవి వనిత క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుల్లూరు నాగరాణి, వాసవి క్లబ్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, కృష్ణవేణి , హరికిరణ్, కార్యదర్శులు రవి, శ్రీధర్, కోశాధికారి విజయలక్ష్మి, పీఆర్వోలు శంకర్, సంతోష్, సుప్రియ, గ్రీటింగ్ చైర్మన్ వీరేశం, గట్టు శ్రీనివాస్, శ్రీనివాస్, రఘు, సతీష్, కవిత, మంజుల, వర్ష పాల్గొన్నారు.

చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-తొగుట

దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డికి జన్మదిన సందర్భంగా తొగుట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం పార్టీ కార్యాలయంలో ఆయనకు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై అనుక్షణం నిరంతరం పోరాటం చేస్తున్న నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకిట్స్ పంపిణీ



నవతెలంగాణ-చేర్యాల

ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో మండల పరిధిలోని రాంపురం గ్రామంలో మూడు చోట్ల చేపట్టిన ఉపాధి హామీ పనులను బుధవారం సర్పంచ్ తివారి దినేష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవికాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఓఆర్ఎస్ పాకెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పోలోజు రాజమణి, యాదగిరి, సిద్ది రాములు తదితరులు పాల్గొన్నారు.